సంపుటి 5 సంచిక 4 జనవరి - ఫిబ్రవరి 2017

# పల్లెసృజన

www.pallesrujana.org

గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక

honeybee.org









# ఇద్దరు సోదరులు



పూర్వం ఇద్దరు అన్నదమ్ములు కలిసి ఉమ్మడిగా సేద్యం చేసేవారు. ఒకతనికి వివాహమై తన సంసారం పెద్దదిగా మారింది. రెండవ వాడికి ఇంకా పెళ్ళి కాలేదు, ఒంటరి వాడు. అయితే ప్రతిరోజూ పని అయిపోగానే వాళ్ళ ఉత్పత్తిలోని లాభాన్ని సమంగా పంచుకునేవారు. ఒకసారి ఒంటరిగా ఉన్న చిన్నతను "నేను అన్నతో సమానంగా పంచుకోవడం సరికాదు. నేనా ఒంటరివాన్ని, పాపం వాడికి పెళ్ళాం, పిల్లలు ఉన్నారు, ఖర్చులెక్కువ, నాకా అవసరాలు తక్కువ" అనుకుని ప్రతిరోజూ తన ధాన్యాగారం నుంచి ఒక బస్తా బియ్యాన్ని చాటుగా తీసుకెళ్ళి తన అన్న ధాన్యాగారంలో వేస్తూ వుండేవాడు. అదే సమయంలో పెళ్ళయినవాడు కూడా ఆలోచించి "నేను వాడు  వసమంగా పంచుకోవడం అన్యాయం, నాకా ఎప్పటికైనా అవసరాలు చూడటానికి నా భార్యా బిడ్డలున్నారు, పాపం వాడికెవ్వరూ లేరు" అనుకుని తన ధాన్యాగారం నుండి ఒక బస్తా బియ్యాన్ని ఎవ్వరూ చూడకుండా ప్రతిరోజూ  సోదరుని ధాన్యాగారంలో వేసి వస్తూవుండేవాడు.

కొన్నాళ్ళకి ఇద్దరికీ ఆశ్చర్యం కలిగింది. ప్రతిరోజూ ఒక బస్తాను, ఇంకొకరికి  ధాన్యాగారంలో వేస్తూ వున్నా, ధాన్యం తరిగిపోవటం లేదేమిటా?! అని ఆలోచించారు.

ఇది ఆశావాదమా? పూర్వం ఇలా ఉండేదా? ఈ ప్రపంచంలో సోదర భావంతో చక్కగా కలిసి మెలిసి ఒకరికొకరు సహాయం చేసుకునే వారా? ఇది చదివైనా ఈ ప్రపంచంలో స్వార్థచింతనతో బ్రతుకుతున్న వారిలో కించిత్ మార్పయినా వస్తుందేమో చూద్దాం. ఇలాంటి సంఘటనలు మీకెదురయితే మాకు తప్పకుండా వ్రాయండి.

– పల్లెసృజన (హనీబీ 13 (1) – 2002)

సంపుటి-5 సంచిక - 4

# పల్లెసృజన

జనవరి - ఫిబ్రవరి 2017

## ఈ సంచికలో...


- 'పల్లెసృజన' 50 సంచికల సింహావలోకనం - 3
- అమ్మకానికి సిద్ధంగా వున్న ఇన్నోవేషన్లు - 6
- అంతరించిపోతున్న 'జాడీ' 'కంబళ్ళ' నేత పరిశ్రమ - 10
- 21వ చిన్న శోధయాత్ర - 18
- సృజనాత్మక రైతు 'బాలయ్య' స్వయం కృషి - 23
- ఇతర రాష్ట్రాల పల్లెకబుర్లు - 27
- 'పల్లెసృజన'లో వికసించిన రెండు 'పద్మా'లు - 30


కవర్ లోపలి పేజీల్లో ....

## ఇద్దరు సోదరులు

హనీబీ కథ,

రైతుల కోసం రైతులు తయారు చేసిన సేంద్రియ పురుగు మందులు

మధ్య పేజీలో :

'ఇగ్నైట్-2016' లో బహుమతి పొందిన చిన్నారుల ఆలోచనలు

ప్రతి పేజీలో అబ్దుల్ కలాం గారి సూక్తులు


### సంపాదకవర్గం

ప్రధాన సంపాదకులు :
బ్రిగేడియర్
పోగుల గణేశం (రిటైర్డ్)

సంపాదకులు :
జమ్ములమడక శశిమోహన్

ఉప సంపాదకులు :
పల్లె వీర రాఘవ రెడ్డి

సలహాదారులు :
డా. కె.ఎల్. రావు
ప్రొ. అనిల్ గుప్త
డా. గీర్వాణి
శ్రీ పి. చంద్రకాంత్ శర్మ
జాగర్లమూడి దుర్గాప్రసాద్
శ్రీమతి అరుణ గణేశం
శ్రీ జమ్ములమడక శ్రీకర్

కార్టూన్లు :
వెంకట్ సిద్ధు



ఎడిటోరియల్ అడ్రస్ :
పల్లెసృజన, 102,
వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్.
పిన్- 500 094.

ఫోన్ :
040-27111959
98660 01678

E-mail :
president@pallesrujana.org

Visit at :
www.pallesrujana.org

డి.టి.పి. & డిజైనింగ్ :
నరేంద్ర గ్రాఫిక్స్, హైదరాబాద్.
81257 99904
E-mail :
narendragrafixhyd@gmail.com



## HoneyBee Regional Collaborators & Publications

**Honey Bee C/o Prof. Anil Gupta**
Indian Institute of Management
Vastrapur, Ahmedabad - 380 015.
Gujarat, India. Ph.: 91-79-26324927, Fax : 91-79-26307341
E-mail : honeybee@sristi.org. http://www.sristi.org

**Aama Akha Pakha (Oriya)**
**Dr. Balaram Sahu,**
3R BP 5/2, BP Colony, Unit-8,
Bhubaneswar-751 012.Orissa.
E-mail : balaram_sahu@hotmail.com

**Hittalagida (Kannada)**
**Dr. T.N. Prakash**
Department of Agricultural Economics,
University of Agricultural Economics,
GKVK, Bangalore-560 065.
E-mail : prakashtnk@yahoo.com

**Num Vali Velanmai (Tamil)**
**P. Vivekanandan,**
SEVA, 45, T.P.M.Nagar,
Virattipathu, Madurai - 625 010.
Tamil Nadu, India.
Phone: 0452 - 238 09 43(O), 0452- 238 36 19 ®
e-mail: vivekseva@gmail.com

**Loksarvani (Gujarati) and**
**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P.O. Box No. 1550.
Ambawadi, Ahmedabad - 380 015.
E-mail : loksarvani@sristi.org
sujhbujh@sristi.org

**Ini Karshakan Samsarikkatte**
**(Malayalam)**
**James T J,**
Peemade Development Society,
Peermade, Idukki-685 531, Kerala.
E-mail : pedes@md2.vsnl.net.in


Printed, Published and Owned by **Brig. Pogula Ganesham,** Chief Editor, Published from 102, Vayupuri, Sainikpuri Post, Secunderabad-500 094, A.P. Ph.: 040-27118555, Mobile : 098660 01678 and Printed at **M/s Narendra Graphics**, 1-5-1055/2/14, Flat No. 102, B. Block, Silver Springs Residency, Saibaba Nagar, Old Alwal, Secunderabad - 500 010. Ph.: 81257 99904, Editor Sri **J. Sesimohan.**

# సంపాదకీయం

## విలువైన నీరు ఎగుమతి చేయడం సబబా?

గత అయిదు దశాబ్దాలలో భారతదేశం ధాన్య ఉత్పత్తిలో గణనీయమైన అభివృద్ధి సాధించింది. బియ్యం ఉత్పత్తి మూడురెట్లు, గోధుమల ఉత్పత్తి 8 రెట్లు పెరిగింది. ఆహార కొరతనుండి మనం ధాన్యం ఎగుమతులు చేసే స్థాయికి చేరుకున్నాం. 1995లో మొదటిసారిగా భారతదేశం బియ్యం ఎగుమతిని ప్రారంభించింది. 2012–13లో బాస్మతి బియ్యం 3.76 మిలియన్ టన్నులు (8.6 బిలియన్ డాలర్లు) ఎగుమతి చేయగా, ఇతర బియ్యం రకాలు 7.13 మిలియన్ టన్నులు (2.9 బిలియన్ డాలర్లు) ఎగుమతి చేయడం జరిగింది. 2015వ సంవత్సరంలో 10 మిలియన్ టన్నుల బియ్యాన్ని ఎగుమతి చేశాం. అదే సంవత్సరంలో మొత్తం ఆహార ధాన్యాల ఎగుమతులు 24 మిలియన్ టన్నులు. ప్రస్తుతం ప్రపంచంలో భారతదేశం బియ్యం ఎగుమతిలో అగ్రగామిగా ఉన్నది.

ఈ స్థాయి ఆహార భద్రతకు మనం చేరుకునేందుకు మార్గం అనుకున్నంత సుగమంగా లేదు. గత యాభైయేళ్ళలో ప్రభుత్వాలు వ్యవసాయ రంగానికి చాలా రకాలుగా మద్ధతునిచ్చాయి. పెట్టుబడుల్లో అనేక రకాల సబ్సిడీలను ప్రకటించాయి. ఎరువులు, విత్తనాలు, నీరు, విద్యుత్తు, డీజల్ లాంటి సబ్సిడీలతో పాటు, పేద ప్రజలకు ఆహార ధాన్యం (బియ్యం, గోధుమలు) సరఫరాలో కూడా సబ్సిడీలను అందిస్తోంది. 2015–16 సంవత్సరంలో ఆహార సబ్సిడీ రూ. 1.24 లక్షల కోట్లు కాగా, ఎరువుల సబ్సిడీ రూ. 73,000 కోట్లు ఇవ్వటం జరిగింది. ఇంతేకాక, ఇతర సబ్సిడీలకు వేల కోట్ల రూపాయలను కేటాయించారు. ఈ ఖర్చులన్నీ ధాన్య ఉత్పత్తి ఖర్చును ఇనుమడింప జేస్తాయి.

వాస్తవంగా మనదేశం ఆహార ధాన్యాలను ఎగుమతి చేసే స్థాయిలో ఉందా? లేక విదేశీ నీతి, ప్రపంచ ఆర్థిక అవసరాల దృష్ట్యా ఎగుమతి చేయడం జరుగుతుందా? శాస్త్రవేత్తల గణాంకాల ప్రకారం మన దేశంలో భూగర్భ జలాలు సంవత్సరానికి 1.4 మీటర్ల లోతుకు పోతున్నాయి. వీరి గణాంకాల ప్రకారం వచ్చే దశాబ్దాల్లో వ్యవసాయానికి నీటిని అందించటం ఎంత కష్టమవుతుందో ఆలోచించండి!. మనం ధాన్యం ఎగుమతి ద్వారా విలువైన నీటిని విదేశాలకు ఎగుమతి చేస్తున్నామా?. వీటన్నిటినీ లెక్కిస్తే మనం సంవత్సరానికి 40 ట్రిలియన్ లీటర్ల నీటిని ఎగుమతి చేస్తున్నాం. ఇది సరియైన నిర్ణయమేనా? అంతే కాకుండా బాస్మతి బియ్యం కాకుండా, ఇతర రకాల బియ్యాలను కూడా మనం ఎగుమతి చేస్తున్నాం. కాని, మనకు వచ్చే ధర పెట్టుబడికి కూడా పూర్తిగాసరిపోవటం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో మనం ధాన్యాన్ని ఎగుమతి చేయడం దేశానికి శ్రేయస్కరమో కాదో చర్చించ వలసిన అవసరం ఉంది. ఆహార ధాన్యాల ఎగుమతులు ఆపడంతోనే మన ఆహార భద్రత భవిష్యత్తులో బాగుంటుందని మా విశ్వాసం.

పునాది స్థాయి ఇన్నోవేషన్లు విరివిగా గ్రామాల్లో, పట్టణాల్లో కనిపిస్తున్నాయి. వారందరినీ చేరదీసి, వాటిని వెలుగులోకి తీసుకు రావటానికి మీ అందరి సహకారం కావాలి. మీ దృష్టికి వచ్చిన ఏ ఇన్నోవేషన్ అయినా..... వ్యవసాయం, పశు సంబంధం, ఆరోగ్యం.... ఏవైనా మాకు తెలియజేయండి. వాటిని పరిశీలించి, వాటి అభివృద్ధికి తోడ్పాటునందించి, ఆ విలువైన ఆలోచనలను ప్రజానీకానికి చేరవేయాలన్న మా ప్రయత్నానికి తోడ్పడగలరని ఆశిస్తున్నాం.



శ్రీయుతులు చింతకింది మల్లేశం, దరిపల్లి రామయ్య గార్లకు భారత ప్రభుత్వం 'పద్మశ్రీ' పురస్కారం ప్రకటించడం 'పల్లెసృజన' కుటుంబానికి ఎంతో ఆనందాన్ని, ముున్ముందుకు వెళ్ళడానికి ప్రోత్సాహాన్ని ఇచ్చింది. ఈ ప్రోత్సాహం, మహోత్సాహం కావాలని కోరుతూ......

భవదీయ

బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం

కష్టాలు నిన్నుసాధించటానికి రాలేదు.... నీ శక్తి సామర్థ్యాలను బయటకు తీసి నిన్ను నీవునిరూపించుకునేందుకే వచ్చాయి...




# 'పల్లెసృజన' 50 సంచికల సింహావలోకనం

**- వీర రాఘవ రెడ్డి, ఉప సంపాదకులు**

**గత 50 సంచికలలో 'పల్లెసృజన' అందించిన జ్ఞానాన్ని ఒకసారి సింహావలోకనం చేసుకోవాలని, ఇంతవరకు ప్రచురించిన అంశాలను సూక్ష్మంగా ఇక్కడ పొందు పరుస్తున్నాము. పాఠకులు గమనించి, అవసరమైన పత్రికలను పల్లెసృజన కార్యాలయం నుండి పొందవచ్చు.**

**-ఎడిటర్**

### సెప్టెంబర్-అక్టోబర్ 2011:

**చింతకింది మల్లేశానికి శాంసంగ్ పురస్కారం :**

ఆసు యంత్రం సృష్టికర్త నల్గొండ జిల్లాకు చెందిన చింతకింది మల్లేశానికి శాంసంగ్ సంస్థ జాతీయ స్థాయి పురస్కారం అందజేసింది. 2 లక్షల రూపాయల నగదుతో ఈ పురస్కారాన్ని అందజేసింది.

**ఆసు కుటుంబ సభ్యుల ఆత్మీయ సమావేశం :**

ప్రపంచంలోని ఎంతోమంది 'పల్లెసృజన' ప్రవేశ పెట్టిన 'ఆసు కుటుంబం' విధానానికి స్పందించి తమ సహకారాన్ని అందించటంతో ఆసుకుటుంబ సభ్యులకు ఆసు యంత్రాలను అందించడం జరిగింది. ఈ కుటుంబ సాధక బాధకాలను తెలుసుకునేందుకు ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయటం జరిగింది.

### నవంబర్-డిసెంబర్ 2011:

**ఇన్నోవేషన్లను వ్యాపారాత్మకంగా మార్చి వినియోగంలోకి తీసుకు రావాలి :**

భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసిఎఆర్) మార్గదర్శకత్వంలో జాతీయ వ్యవసాయ అకాడమి, రాజేంద్ర నగర్ వారు పల్లెసృజన ఇన్నోవేషన్లను గుర్తించి వీటిని వ్యాపారాత్మకంగా మార్చి వినియోగంలోకి తీసుకు రావటానికి తమవంతు సహకారాన్ని అందిస్తామని, దీని కొరకు పల్లెసృజన ఇన్నోవేటర్లతో ఒక ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించడమైనది.

### జనవరి-ఫిబ్రవరి 2012:

**అతని ఆలోచనలు నలుగురి ఇళ్ళల్లో వెలుగు నింపుతాయి:**

సంగారెడ్డికి చెందిన కాగితాల రామచంద్రయ్య తన ఆలోచనా విధానంతో గ్రామాల్లో సైతం ఎక్కువ కరెంటు కష్టాలనుండి విముక్తి పొందేందుకు సోలార్ కరెంటుతో ఎల్లవేళలా వెలుగులు నింపుతున్నాడు. ఇతను రూపొందించిన కరెంటుతో ఇంట్లో ఎలాంటి షాక్ కూడా కొట్టదు. కరెంటు బిల్లు భయం లేకుండా ఆనందంగా వుంటున్నారు.

**వర్షం వచ్చినపుడు పక్షులన్నీ నీడను వెతుక్కుంటాయి కానీ గద్దలు వర్షానికి తడవకుండా మేఘాల పైనుంచి ప్రయాణిస్తాయి.**




**మార్చి-ఏప్రిల్ 2012:**

**గ్రామీణ పశువైద్యుడు బోయ పెద్దరాజన్న :**

అనంతపురం జిల్లాకు చెందిన పెద్దరాజన్న పశువుల వైద్యం చేస్తున్న సేవలు అనితర సాధ్యం. ఆయన అందించిన వైద్యం ఎన్.ఐ.ఎఫ్. కూడా ధృవీకరించడంతో ఆయనను రాష్ట్రపతి పురస్కారం వరించింది. 2015లో స్వర్గస్తులైన బోయపెద్దరాజన్న వైద్యం ప్రస్తుతం అత్యంత సమర్థవంతంగా పనిచేస్తూ మార్కెట్లో విరివిగా అమ్ముడు పోతూ ప్రస్తుతం రాజన్న కుటుంబాన్ని ఆదుకుంటోంది. నాడు బోయ పెద్ద రాజన్న 'సివిల్ సొసైటీ హాల్ ఆఫ్ ఫేం' పురస్కారం కూడా అందుకున్నాడు.

**చుక్క చుక్క నీరు :**

నేడు విచ్చల విడిగా జరుగుతున్న నీటి వృధాను అరికట్టకపోతే భవిష్యత్తులో నీటి కరువు ఎంత తీవ్రంగా వుంటుందో నాడు "22 మార్చి, ప్రపంచ 'వాటర్ డే' సందర్భంగా ప్రత్యేక వ్యాసం ప్రచురించడమైనది. ఈ సంవత్సరం అన్ని ప్రభుత్వాలు నీటి పొదుపు చర్యలను అత్యంత ఆవశ్యకమైన చర్యగా చేపట్టాయి.

**మే-జూన్ 2012:**

**భూమయ్య చారి రూమ్ ఎయిర్ క్లీనర్ :**

తమ పరిధిలోనే ఎవరైనా తయారు చేసుకునే విధంగా రూమ్ ఎయిర్ క్లీనర్‌ను తయారు చేశాడు ఇన్నోవేటర్ భూమయ్య చారి. అనారోగ్య కారణాలలో ప్రధానమైనది గాలిలోని ధూళి. ఈ ధూళిని నియంత్రించే అతి సులువైన సాధనాన్ని తయారు చేసి చూపించాడు.

**జులై-ఆగస్టు 2012:**

**కొత్త పరికరాల సృష్టికి అవసరాలే మూలం :**

రంగారెడ్డి జిల్లాకు చెందిన 'కొత్తూరు ఆనందం' డిగ్రీవరకు చదివినా తన తండ్రికి వ్యవసాయంలో చేదోడు వాదోడుగా వుంటూ తన మేధస్సుతో సైకిల్‌కు గొర్రును ఏర్పాటు చేసి తన పొలాన్ని తానే దున్నుకున్నాడు. అవసరం ఒక పరికరాన్ని సృష్టించేలా చేస్తుందనటానికి ఇదొక తార్కాణం.

**సెప్టెంబర్-అక్టోబర్ 2012:**

**సునాయాసంగా ఇటుకల తయారీ :**

గుంటూరు జిల్లాకు చెందిన కొరంపల్లి చంద్రశేఖర్ అనే ఒక ఇటుకల తయారీ కార్మికుడు తన అనుభవంతో తక్కువ సమయంలో ఎక్కువ ఇటుకలను తయారు చేసేలా ఒక పరికరాన్ని తయారు చేశాడు. దీనికి ఎటువంటి ఇంధనం, కరెంటు అవసరం లేకుండానే కేవలం మానవ శక్తితో పనిచేస్తుంది. దీన్ని తయారు చేసినందుకు రాష్ట్రపతి పురస్కారం కూడా అందుకున్నాడు చంద్రశేఖర్.

**చిన్న పరికరంతో ప్రమాదాల నివారణ :**

పోతర్ల మల్లికార్జున్ అనే ఒక ఇన్నోవేటర్ మోటార్ సైకిల్ సైడ్ స్టాండ్ తీసుకోకుండా సవారి చేస్తూ ప్రమాదాలకు గురయ్యే వాహన చోదకులను ఆదుకునేందుకు ఒక చిన్న ఇనుప ముక్కను అమర్చడం ద్వారా ప్రదామాల నివారణకు ఉపాయాన్ని కనుగొన్నాడు దీన్ని అమర్చుకుంటే సైడ్ స్టాండ్ తీస్తే తప్ప మోటార్ సైకిల్ ముందుకు వెళ్ళే అవకాశమే లేదు. నాడు మల్లికార్జున్ కనిపెట్టిన ఇన్నోవేషన్ నేడు దాదాపు ప్రతి మొటార్ సైకిల్ తయారీ సంస్థ దీన్ని తయారీలోనే ఏర్పాటు చేసి అమ్మే స్థాయికి చేరుకుంది.

**నవంబర్-డిసెంబర్ 2012:**

**సులభంగా బట్టలు ఉతికే విధానం కనిపెట్టి లీలావతి :**

వయసు మీరిన వారు మాత్రమే వుండే గృహాల్లో పని మనిషి అవసరం లేకుండా కూర్చునే బట్టలు ఉతికేందుకు సులభమైన పరిష్కారం కనుగొంది శ్రీమతి పాటిబండ్ల లీలావతి. ఇలాంటి ఎన్నో పరిష్కారాలను

**నేను గెలవాలి అని గట్టిగా నిర్ధారించుకుంటే ఎప్పటికీ ఓడిపోవు.**

పల్లెసృజనకు అందించిందీమె. లీలావతి గారి మరో నూతన ఇన్నోవేషన్ 'స్పందన' (32వ పేజీ)లో చదవండి.

**ద్విచక్ర వాహనదారుల నిత్య కష్టాల నుండి గట్టెక్కించిన ...:**

పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన యశోదా కృష్ణ అనే ఒక మోటార్ సైకిల్ మెకానిక్ ద్విచక్ర వాహనదారుల కష్టాలను కొన్నింటికి సులభమైన పరిష్కారాలను అందించాడు. బైక్‌లో పెట్రోల్ అయిపోయినా పెట్రోల్ పంపు వరకు వెళ్ళేలా ఒక చిన్న పరికరం, పెట్రోలు బంకుల్లో కొలతల్లో జరిగే మోసాలను అరికట్టేందుకు ఒక ఉపాయం, హెల్మెట్ ధరిస్తే తప్ప బైక్ కదలకుండా వుండేలాంటి ఎన్నో ఉపాయాలను కనిపెట్టాడు.

**పైసా పెట్టుబడి లేని వరి విత్తే సాధనం :** రంగారెడ్డి జిల్లాకు చెందిన వరికుప్పల యాదయ్య పైసా పెట్టుబడి లేకుండా కేవలం ఇంట్లోని పనికిరాని వస్తువులతో వరి నాటేందుకు ఒక సీడ్ డ్రిల్‌ను తయారు చేసి వాడి చూపించాడు.

**జనవరి-ఫిబ్రవరి 2013:**

**కొబ్బరి బోండానికి రంధ్రం చేసే పరికరం :** ఖమ్మం జిల్లాకు చెందిన అమృత ప్రసాద్ కొబ్బరి బోండాంలను అమ్మే వ్యక్తులు కత్తితో బోండాంను నరుకుతో ప్రమాదాలకు గురవకుండా సులభంగా కొబ్బరి బోండాంకు రంధ్రం చేసేలా ఒక పరికరాన్ని తయారు చేశాడు. దీనికి ఎటువంటి ఇంధనం అవసరం లేకుండా పని చేస్తుంది.

**మహిపాల్ కల్టివేటర్ :** వరంగల్ జిల్లాకు చెందిన మహిపాల్ చారి చేతితో నడిపే ఒక కల్టివేటర్‌ను తయారు చేసి ఎంతోమంది రైతులకు ఊరటను కలిగించాడు. తక్కువ పెట్టుబడితో తమ పొలాల్లోని అంతర సేద్యాలతో సహా అన్ని పనులను చేసుకునేందుకు అనువుగా వుంటుందీ పరికరం ప్రస్తుతం ఈ ఇన్నోవేటర్ వీటి తయారీలోనే ఆనందంగా తన జీవితం గడుపుతున్నాడు.



**ఒకచెట్టు నుంచి ఎక్కువ అంట్లను రూపొందించిన కృష్ణారెడ్డి**

ఒక దానిమ్మ చెట్టు నుండి కొన్ని వందల మొక్కలను రూపొందించే అరుదైన విధానం ద్వారా ఎంతోమంది రైతులకు శ్రేష్ఠమైన మొక్కలను అందించాడు మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన గుంటక కృష్ణారెడ్డి.

**మార్చి-ఏప్రిల్ 2013:**

**కూలీల భారం పెరగకుండా పత్తి వలిచే యంత్రం :** పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ముళ్ళపూడి సత్యనారాయణ పత్తి వలిచేందుకు ఒక పరికరాన్ని రూపొందించాడు. దీని సహాయంతో ఒకే వ్యక్తి పదిమంది కూలీలు చేసే పనిని చెయ్యగలడు.

**బోరులో నీళ్ళు అయిపోతే మోటార్ ఆగిపోయే పరికరం :**

పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన నాగ శ్రీనివాస్ అనే ఇన్నోవేటర్ బోరు బావిలో నీళ్ళు అయిపోయినా డీజిల్ ఇంజన్ ఆడితే అది కాలిపోయే ప్రమాదం వుందని గ్రహించి, దాన్ని నివారించేందుకు బోరుబావిలో నీళ్ళు అయిపోయిన వెంటనే మోటార్ కూడా ఆగిపోయేలా ఒక పరికరాన్ని తయారు చేశాడు.

**మే-జూన్ 2013:**

**విశిష్ట రైతు పొన్ను స్వామి :** తమిళనాడు నుంచి మెదక్ జిల్లాకు వలస వచ్చిన పొన్నుస్వామి అనే రైతు వినూత్న పరికరాల తయారు చేసుకుని కూలీలను తగ్గించుకునే విధానాలను అవలంభిస్తూ వినూత్న పద్ధతిలో సేంద్రియ వ్యవసాయాన్ని చేసి ఎంతో పేరు ప్రఖ్యాతులను ఆర్జించాడు.

**మూలికా వైద్యుల సమావేశం :** నాడు సమైఖ్య ఆంధ్రప్రదేశ్ లోని మూలికా వైద్యులు అందరినీ ఒకచోట చేర్చి మన భారతీయ వైద్య విధాన ప్రత్యేకతను చాటేందుకు కృషి చేసింది 'పల్లెసృజన'. ఈ సమావేశానికి రాష్ట్రంలోని నలుమూలల నుంచి ఎంతోమంది మూలికా వైద్యులు విచ్చేసి తమ వైద్య విధానాలను తెలపటంతో పాటు, తమకు ఇంత విలువనిచ్చినందుకు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ●

**మనిషికి జీవితంలో కష్టాలు కూడా ఉండాలి. ఎందుకంటే ఆ సమయంలోనే సుఖాలను గురించి ఆలోచిస్తాడు.**



## రైతుల కొరకు రైతులు తయారు చేసిన

# అమ్మకానికి సిద్ధంగా వున్న ఇన్నోవేషన్లు

## వేరుశనగ త్రవ్వి తీసే యంత్రం

**సమస్య – పరిష్కారం :**

వాణిజ్య పంటలలో వేరుశనగది ప్రథమ స్థానమనే చెప్పుకోవచ్చు. దీన్ని ప్రధాన పంటగాను, కందితో మిశ్రమ పంటగాను రైతులు సాగు చేస్తున్న విషయం అందరికీ విదితమే. ఈ పంట సాగుకు పడే కష్టానికి దాదాపు రెట్టింపు కష్టం పంట కోతకు పడుతుంది. దీనికి ప్రధాన కారణం కూలీలు లభించకపోవడం, ఒకవేళ లభించినా అధిక మొత్తంలో చెల్లింపులు. పర్యవసానంగా ఈ పంట సాగులో పెట్టిన ఖర్చులకి తగ్గ ఫలితం రావటం లేదు. దీనికి పరిష్కారంగా వేరుశనగ కాయలను భూమినుండి తీసి వేరు చేయటానికి గుజరాత్‌కు చెందిన "సంజయ్ కుమార్ డి. తిల్వా" అనే రైతు ఒక పరికరం తయారు చేశాడు.

**పరికరం :**

ట్రాక్టర్‌తో అనుసంధానం చేసుకుని పని చేసే ఈ పరికరం 540 లేదా 1000 ఆర్‌పిఎం వేగానికి అనువుగా తయారు చేయబడింది. ఈ పరికరం వేరుశనగ చెట్లను భూమినుండి త్రవ్వి తీస్తుంది. తీసిన మొక్కలు ఒక కన్వేయర్ బెల్టు ద్వారా వెళ్తూ ఆ కన్వేయర్ బెల్టులోని కుదుపులకు చెట్టు నుండి వేరుశనగ కాయలు వేరౌతాయి. ఇలా కుదుల కారణంగా కాయలను అంటుకుని వున్న మట్టి కూడా వేరు

**సూర్యుడిలా వెలగాలి అనుకుంటే ముందు సూర్యుడిలా కాలడం నేర్చుకో.**





చేయబడి వేరుశనగ కాయలు నాణ్యతగా ఉండటం వల్ల మార్కెట్లో మంచి ధర కూడా లభించే అవకాశముంటుంది.

**సాంకేతిక వివరాలు :**

❀ ఈ యంత్రం ఉపయోగించటానికి గంటకు ఒక లీటరు డీజిల్ ఖర్చవుతుంది.

❀ 35 హార్స్‌పవర్‌ల శక్తిగల ట్రాక్టర్‌తో దీన్ని అనుసంధానం చేసుకోవచ్చు.

❀ ఈ పరికరం 510 కిలోల బరువుంటుంది.

❀ పంట నూర్పిడి 98 శాతం జరుగుతుంది.

❀ పరికరం 1250 మి.మీ. వెడల్పు ఉంటుంది.

❀ 100-120 మి.మీ. లోతుకు త్రవ్వి వేరుశనగను పీకుతుంది.

**ముఖ్యాంశాలు :**

❀ ఇటువంటి ఇతర పరికరాలతో పోలిస్తే ఇది వేరుశనగ పంటను త్రవ్వి తీయటమే కాకుండా కాయలను శుభ్రం చేసి పెడుతుంది.

❀ ఇతర పరికరాలకన్నా కాయలు దెబ్బ తినకుండా చాలా సమర్థవంతంగా పని చేస్తుంది.

❀ ఈ సాధనంతో గంటకు ఒకటిన్నర ఎకరాల్లో వేరుశనగను పీకి కాయలు వేరు చేస్తుంది.

❀ ఇది అన్ని రకాల భూముల్లో పని చేస్తుంది.

**పురస్కారాలు :**

❀ ఇన్నోవేటర్ సంజయ్ కుమార్‌కు ఎన్.ఐ.ఎఫ్. వారు 7వ జాతీయ ఇన్నోవేషన్ పోటీలలో బహుమానమే కాక, 2013లో ఉత్తమ సాంకేతిక జ్ఞాన పురస్కారం కూడా లభించింది.

❀ 2004 లోనే పేటెంటుకు నమోదు చేయటం జరిగింది. ●

Phone: +91 79 26732456/ 2095, Fax : +91 79 26731903
E mail: bd@nifindia.org, web : www.nif.org.in

## గ్రామీణ సృజనా శక్తికి వేదిక పల్లెసృజన

'పల్లెసృజన' ఒక వేదికగా ఉపయోగ పడాలంటే మీరు మీ సమస్యలను, ఆలోచనలను, జ్ఞాన సంపదను సంకోచించకుండా మాతో పంచుకోండి. ఎంత చిన్న ఆలోచన అయినా సరే మేము ఆహ్వానిస్తాం. ప్రతి సంచికలో ఉత్తమ ఎంట్రీకి ఉచిత వార్షిక సభ్యత్వం ఇవ్వబడుతుంది. మీ సమస్యలను "పల్లెసృజన"లో ప్రచురిస్తాం. వాటికి పాఠకులు సమాధానాలు పంపితే వాటిని కూడా పత్రికలో ప్రచురిస్తాం. మీరంతా సహకరించి ఈ గ్రామీణ సృజనా శక్తిని వెలుగుదారు వేదిక అయిన 'పల్లెసృజన'తో పంచుకుని మీ జ్ఞానం మీతోనే అంతరించి పోకుండా, దానివల్ల ఎంతోమంది రైతాంగం ఉపయోగించుకునేలా చేస్తారని ఆశిస్తున్నాం.

కష్టాల సారాంశమే విజయం.



# సైకిల్ స్ప్రేయర్

**సమస్య – పరిష్కారం :**

సమకాలీన పరిస్థితులలో పంట వేయటం, దిగుబడి సాధించడం అనేది సస్యరక్షణ పైనే ఆధారపడి వుంటుంది. వేసిన పంటను రక్షించుకోవడమన్నది వ్యవసాయంలో అతి ముఖ్యమైన ప్రక్రియ. అయితే ఇది చాలా ఖర్చుతో కూడుకున్నది, చాలామంది కూలీల అవసరం కూడా వుంటుంది. వీపుపైన వేసుకుని పంటలకు పురుగు మందులు పిచికారి చేసే సాధనాలు (స్ప్రేయర్లు) కొన్ని వున్నా, అదంత సులువైన పద్ధతేం కాదు. చిన్న, సన్నకారు రైతులకు పవర్ స్ప్రేయర్ల ధరలు, వాటి నిర్వహణ ఖర్చులు అందుబాటులో వుండవు. ఈ సమస్యకి పరిష్కారంగా గుజరాత్‌కు చెందిన 'మన్సుఖ్ భాయ్ జఘాని' సైకిల్‌పైన తీసుకెళ్తూ పిచికారి చేసే ఒక స్ప్రేయర్‌ను రూపొందించి ఎంతోమంది రైతులకు కూలీల భారం లేకుండా చేశాడు. వీపుపైన స్ప్రేయర్‌ను మోసే భారాన్ని కూడా తగ్గించాడు.

**పరికరం :**

ఇది సైకిల్‌తో అనుసంధానం చేసే స్ప్రేయర్. సైకిల్ పనిచేయటానికి ఎటువంటి బ్యాటరీ కాని, ఇంధనం కానీ అవసరం లేదు. కేవలం సైకిల్ పెడల్ వద్ద గల పెద్ద పండ్ల చక్రానికి స్ప్రేయర్‌కు అమర్చిన మోటార్‌తో కలిపితే చాలు. సైకిల్‌ను చేతితో నడుపుకుంటూ వెళ్తుంటే పండ్ల చక్రంతో అనుసంధానమైన స్ప్రేయర్ తిరిగి మందును పిచికారి





చేస్తుంది. ఈ చక్రం తిరగటం వల్ల ఇతను స్ప్రేయర్‌లో ఏర్పాటు చేసిన పిస్టన్‌లు పనిచేసి పిచికారికి కావలసినంత వత్తిడికి కలుగజేస్తాయి.

**సాంకేతిక వివరాలు :**

❀ సైకిల్ కు ఇరువైపులా మూడున్నర అడుగుల వెడల్పులో అంటే మొత్తం 7 అడుగుల వెడల్పులో పిచికారి చేస్తుంది.

❀ స్ప్రేయర్ ట్యాంకు సామర్థ్యం 25–30 లీటర్లు.

❀ దీని సహాయంతో కేవలం 3 గంటల్లో 4 ఎకరాల వరకు పిచికారి చేసుకోవచ్చు.

**ముఖ్యాంశాలు :**

❀ సాధారణ స్ప్రేయర్‌ను భుజంపై మోయటంతో పాటు, చేతితో వత్తిడిని కలుగజేయటం వల్ల కలిగే శారీరక శ్రమ ఇందులో ఏమీ వుండదు. కేవలం సైకిల్‌ను నడుపుకుంటూ వెళ్తే చాలు.

❀ తక్కువ సమయంలో ఎక్కువ పొలానికి పిచికారి చేయవచ్చు.

❀ పిచికారి చేసే చక్రాన్ని పంటకు అనువుగా ఎత్తు, పొడవులను మార్చుకోవచ్చు.

❀ ఎటువంటి నిర్వహణా ఖర్చులు లేవు.

❀ పిచికారి పని అయిపోగానే, స్ప్రేయర్‌ను పక్కన పెట్టి సైకిల్ తొక్కుకుంటూ ఇంటికి వెళ్ళిపోవచ్చు.

**పురస్కారాలు :**

❀ ఎన్.ఐ.ఎఫ్. వారి 3వ జాతీయ స్థాయి ద్వైవార్షిక పునాది స్థాయి ఇన్నోవేషన్ పోటీలలో మన్సుఖ్ భాయ్‌కి ప్రోత్సాహక బహుమతి లభించింది.

❀ ఇదే కాక, ఇతను చేసిన అనేక రకాల రైతులకు చెందిన ఇన్నోవేషన్‌లకి అనేకసార్లు ఎన్.ఐ.ఎఫ్. వారిచే సత్కరించబడ్డారు. ●

**వివరాలకు సంప్రదించండి:**

**Phone: +91 79 26732456/ 2095, Fax : +91 79 26731903**
**E mail: bd@nifindia.org, web : www.nif.org.in**

**ఎన్.ఐ.ఎఫ్. లో మీకు అవసరమైన ఇన్నోవేషన్‌ల అన్వేషణ**

నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ గత 14 యేళ్ళుగా సేకరించిన గ్రామీణ ఇన్నోవేషన్లు, సాంప్రదాయ జ్ఞానం ప్రజలందరికీ అందుబాటులో వుండటానికై ఒక వెబ్‌సైట్ తయారు చేసింది. ఈ జ్ఞానమంతా వెబ్‌సైట్ www.nifindia.org లో చూడవచ్చు. అలాగే మీకు ఏ సమస్యకైనా పరిష్కారం ఈ జ్ఞానం కోశంలో వుందో లేదో తెలుసుకోవాలనుకుంటే

**NIF టోల్ ఫ్రీ నెంబర్ 1800 233 5555**

కు కూడా ఫోన్ చేసి తెలుసుకోవచ్చు.

కానీ ఫోన్‌లో మాట్లాడాలనుకునేవారు ఇంగ్లీషు లేదా హిందీలో మాత్రమే సంప్రదించవలసి వుంటుంది.

**లక్ష్యం లేకపోవటం కన్నా పెద్ద నేరం ఏదీ ఉండదు.**



# అంతరించిపోతున్న 'జాడీ' 'కంబళ్ల' నేత పరిశ్రమ

ఫొటోలు : పోచా చిన్న నాగిరెడ్డి సౌజన్యంతో

"పల్లె కన్నీరు పెడుతుందో కనిపించని కుట్రల
నా తల్లి కన్నీరై పోతుందో కనిపంచని కుట్రల"

అంటూ తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఒక ప్రముఖ రచయిత గ్రామీణ వృత్తులు కనుమరుగై పోతున్నాయంటూ తన కన్నీటి పర్యంతం యావత్ తెలుగు ప్రపంచానికి తెలియజేశాడు. ఈ పాటను విన్న ప్రతి తెలుగు వాడు 'ఇది నిజమే కదా' అనుకున్నాడు. అటువంటి సంఘటన ఈమధ్య ఒక చేతివృత్తిదారుడి నోటివెంట విని కన్నీటి పర్యంతం కావలసిందే, ఎందుకంటే అతను చెప్పిన ప్రతి మాట అక్షర సత్యం...

"చేతివృత్తులను పునరుజ్జీవింపజేయాలి' అప్పుడే గ్రామీణ వికాసం వెల్లి విరుస్తుందన్నది అందరూ అంటున్న మాటే. కానీ రోజు రోజుకు కనుమరుగవుతున్న చేతివృత్తులను నేర్పించాల్సింది ఎవరు? ఈ చేతివృత్తులను ఎవరు నేర్పిస్తే భవిష్యత్ తరం మనసుల్లోకి నేరుగా చేరుకుంటుంది? అన్న ప్రశ్నకు ఆంధ్రప్రదేశ్ కర్నూలు జిల్లా, కల్లూరు మండలం లోని 'పర్ల' గ్రామంలో 'కంబళ్ళు, జాడీలు' మగ్గంపై నేసే "సుంకన్న" చేతివృత్తుల పునరుజ్జీవనానికి తన పరిష్కారం చూపిస్తున్నాడు.

**ఇంతకూ చేతివృత్తి పనిని నేర్పించాల్సింది ఎవరు?**

10వ తరగతి నుండి ఉన్నత చదువులు చదువుకుని, 'చేతివృత్తికి సంబంధించిన కోర్సులు పూర్తి చేసుకున్న' యువకులు చేతివృత్తిలో శిక్షణ ఇస్తే నేర్చుకునే వారి మనసుల్లోకి త్వరగా వెళ్ళే అవకాశం తక్కువ. పూర్వం నుండి వంశ పారంపర్యంగా చేతివృత్తి చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న వారైతేనే వృత్తి విద్యలను అర్థమయ్యేలా నేర్పగలరని అంటాడు సుంకన్న. అప్పుడే యువకులు భవిష్యత్తులో చేతివృత్తి ద్వారా తన జీవితాలను సుసంపన్నం

ఒక్కొక్కప్పుడు బడి మానేసి స్నేహితులతో షికారుకెళ్ళడమే మంచిదేమో. ఎందుకంటే ఎదిగాక అనిపిస్తుంది....
నాకొచ్చిన మార్కులలో ఆనందం లేదు, కానీ నా జ్ఞాపకాలలో ఆనందం ఉంది అని.



గొర్రె నుండి 'బొచ్చు'ను సేకరిస్తున్న విధానం

చేసుకుంటారు.

**'కంబళ్ళు, జాడీలు' నేసే ఒక గ్రామ కథలోకి వెళ్దాం......**

కర్నూలు జిల్లా కల్లూరు మండలం లోని "పర్ల" అనే ఒక గ్రామం జిల్లా కేంద్రమైన కర్నూలుకు కేవలం 20 కి.మీ. దూరంలోవుంది. మామూలుగా అందరూ ఊహిస్తున్నట్లు జిల్లా కేంద్రానికి కొద్ది దూరంలో వున్నా ఈ గ్రామంలో పట్టణ వాతావరణ ప్రభావం చాలా తక్కువ, గ్రామీణ వాతావరణమే ఎక్కువగా కనిపిస్తుంది. ఈ గ్రామంలో దాదాపు 1,000 కుటుంబాలకు పైగా కాపురముంటే అందులో 300కు పైగా కుటుంబాలు ఒకప్పుడు (దాదాపు 15 సంవత్సరాల క్రితం వరకు) ఒకే "చేతివృత్తి"ని నమ్ముకుని బ్రతికాయి. వారి చేతివృత్తి 'జాడీలు, కంబళ్ళు' నేయటం.

**జాడీలు, కంబళ్ళ ప్రత్యేకత, వాటి ప్రమాణం, ఇతివృత్తం:**

కొద్ది సంవత్సరాల క్రితం గ్రామీణ ప్రాంతాల్లోని ఓ మోస్తరు పలుకుబడి కలిగిన గ్రామీణుల ఇళ్ళల్లో వారి ఇంటికి ఎవరైనా కొత్తవారు కాని, చుట్టాలు కానీ వస్తే ఆ ఇంటి పెద్ద తన నౌకరుతో చెప్పే మొదటి మాట 'ఒరేయ్ అరుగుమీద జాడీ వెయ్యరా' అని. వెంటనే ఆ ఇంటి నౌకరు తాను చేస్తున్న పనిని వదిలి వచ్చి ఆదరా, బాదరాగా ఆ ఇంటి అరుగుపై 'జాడీ' వేస్తే దానిపైన ఆ యజమాని కూర్చుని వచ్చిన అతిథిని కూర్చుండబెట్టి క్షేమ సమాచారాలు కనుగొని, అతనికి మంచినీరు అందించిన తర్వాత వచ్చిన కార్యం గురించిన సమాచారాన్ని సేకరించేవాడు. ఆ తర్వాత ఆ సమాచారానికి అనుగుణంగా తను చేపట్టాల్సిన పనిని గురించి ప్రణాళిక వేసుకునేవారు.

ఇక్కడ మీరు ఒక యజమాని తన నౌకరుతో 'అరుగుపై జాడీ వెయ్యి' అని చెప్పాలంటే ఆ వచ్చిన అతిథి గౌరవంపైన ఆధార పడి వుంటుందన్న విషయం గమనించాలి. అంతటి గౌరవ చిహ్నం గ్రామాల్లో జాడీకి ఇప్పటికీ ఉందంటే అతిశయోక్తి కాదు.

అలాగే రైతు ఇంట్లో తన నౌకర్లకు ప్రతి ఒక్కరికి 'కంబళి' తప్పకుండా ఉండేది! (ప్రస్తుతం రైతుల ఇంట్లో పని చేసే నౌకర్లే కరువయ్యారు అన్నది వేరే విషయం). ఆ నౌకరు వర్షాకాలంలో, చలికాలంలో ఈ 'కంబళి' లేకుండా పొలం పనులకు వెళ్ళే సమస్యే లేదు.

రాయలసీమలోని దాదాపు అన్ని గ్రామాల్లో ఇంట్లో పెళ్ళి జరిగుతుందంటే అందులో ప్రధాన తతంగం 'లింగమయ్య'కు నైవేద్యం సమర్పణ. ఈ తతంగంలో లింగమయ్య నైవేద్యం ఇంటినుండి మేళ తాళాలతో తీసుకు వెళ్ళే పెళ్ళి కుమారుడు లేదా పెళ్ళి కుమార్తె మేనమామ తప్పకుండా ధరించాల్సిన వస్త్రం 'కంబళి'. అలాగే ఇప్పటికీ గ్రామాల్లో పెళ్ళిళ్ళు అయితే వధూవరులు కూర్చునేందుకు ముందుగా 'జాడి' వేసి, దానిపైన పీటలు వేసి, వాటిపైన వధూవరులను కూర్చోబెడ్తారు.

వీటిలో ఒక ప్రత్యేకమైన గుణం కూడా వుంది. ఇది గాలిలోని తేమను విపరీతంగా తనలో ఇముడ్చుకుంటుంది, కానీ, అది తేమగా కనపడదు!. దీన్ని కప్పుకుని మంచు



సేకరించిన గొర్రె బొచ్చును ఉన్నిగా మార్చే యంత్రం

**విద్యార్థులలో ఉండాల్సిన ముఖ్య లక్షణం ప్రశ్నించటం. వాళ్ళకా అవకాశమివ్వండి.**



యంత్రంలో శుద్ధి చేయబడి తయారైన గొర్రె ఉన్ని

కురిసే చలిలో సైతం బజార్లో ఆకాశం క్రింద పడుకున్నా ఆ వ్యక్తికి చలి అనేదే వెయ్యదు!!. వర్షంలో వీటిని కప్పుకుని ప్రయాణిస్తే ధరించిన వ్యక్తి తడవడు సరికదా..... కంబడిపైన నీరు కూడా వుండదు (అంటే తడిసినట్లు కూడా అనిపించదు). పైత్యం (వళ్ళంతా దద్దుల్లు పోవటం) చేసిన వ్యక్తి ఈ జాడీ లేదా కంబళిని కప్పుకుని పది నిమిషాలు పడుకుంటే పైత్యం తగ్గిపోతుందని గ్రామాల్లో ఇప్పటికీ విశ్వసిస్తారు.

ఇదీ గ్రామీణ సాంప్రదాయంలో జాడి' 'కంబళి'ల పాత్ర, వారి జీవితంలో భాగం.

**జాడి, కంబళిల ప్రత్యేకత :**

ఇవి పూర్తిగా కేవలం 'గొర్రె' బొచ్చుతో తయారైనవి. జాడిలు ఎక్కువ భాగం నలుపు రంగులో వుండి, దాని రెండు వైపుల తెల్లటి అంచును కలిగి వుంటాయి. అతి తక్కువ జాడీలు ఎరువు లేదా గోధుమ రంగు కలిగి వుంటాయి. అలాగే కంబళ్ళు కూడా ఇదే రంగులో వుంటాయి. రెండింటికీ తేడా ఏమిటంటే జాడీ కాస్త బరువుగా ( 5 కిలోల నుండి 12 కిలోల వరకు) వుంటుంది. కంబళి అయితే 2 నుండి 5 కిలోల వరకు బరువు కలిగి వుంటుంది. వీటిని కొనుగోలు చేసే వ్యక్తులూ ఉన్నారు, కానీ వీటిని నేత నేసే కార్మికులు మాత్రం కనుమరుగై పోయే పరిస్థితి అత్యంత సమీపంలో ఉందన్నది భరించలేని వాస్తవం. 300కు పైగా ఈ పనిచేసే చేనేత కుటుంబాలున్న ఈ గ్రామంలో ప్రస్తుతం కేవలం 2 కుటుంబాలు మాత్రమే చేస్తున్నాయంటేనే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

వీటిని నేయటానికి యంత్రాలు, అవసరం లేదు, కేవలం తామే స్వయంగా చెక్క (కర్ర)తో చేసుకునే అతి తక్కువ పరికరాలే యంత్రాలు కావటం ఆశ్చర్యం వేస్తుంది.

**తయారీ విధానం :**

మొదటగా ఈ వృత్తివారు చేసేది తమ సమీప గ్రామాల్లోని గొర్రెల పెంపకం దారుల (గొర్లోళ్ళు అంటారు) వద్దకు వెళ్ళి వారి అనుమతితో (ఒకప్పుడు ఉచితంగా లభించేది, ఇప్పుడు గొర్రెకు రూ. 5 వరకు చెల్లిస్తున్నారు) గొర్రెలకు పెరిగిన జుత్తు (బొచ్చు)ను కత్తిరించుకొని, దాన్ని తమ గ్రామంలో గల ఒక 'పింజిమర'కు అనుసంధానమైన ఒక చిన్నపాటి యంత్రం ద్వారా ఆ బొచ్చును నేతకు అనువైన ముడిసరుకు 'ఉన్ని' గా మార్చుకుంటారు. గొర్రెల నుండి సేకరించిన గొర్రె బొచ్చును ఈ ఉన్ని తయారీ యంత్రంలో వేయటం వల్ల అందులోని అనవసర వ్యర్థ పదార్థాలన్నీ వేరైపోయి, గొర్రె 'ఉన్ని' దాదాపు 'దూది' లాగా తయారౌతుంది.

తర్వాత ఆ 'ఉన్ని'ని ఒక రాట్నంపై (ప్రత్యేకంగా మహిళలు) ఒక దారం వలె ఏకుతారు (గాంధీ వినియోగించినటువంటి రాట్నమే సుమా!). ఆ దారాన్ని ఒక



ఉన్నితో దారం ఏకుతున్న మహిళ 'అబిదాబి'

దేశంలో చాలా తెలివైన వారు పాఠశాల గదుల్లో చివరి బెంచీలో కూర్చువారై ఉండొచ్చు.


పడుగును శుద్ధి చేస్తున్న విధానం

చట్రంలో అసు పోస్తారు (ఈ అసు చాలా వరకు పోచంపల్లి చేనేతవారు పోసే ఆసును పోలి వుంటుంది). ఆసు పోసిన దారాలను ఒక 'పడుగు'గా తయారు చేసి, దానిపై చింత పిక్కలను బాగా ఉడికించి, రుబ్బిన తర్వాత తయారైన జిగట పదార్థాన్ని 'జాడీ పడుగుకు దట్టంగా పట్టిస్తూ, ఒక బ్రష్షుతో దాన్ని బాగా అతుక్కునేట్లుగా పైకి, క్రిందకి రుద్దుతూ ఆ దారాలకు బాగా అతుక్కునేలా చేస్తారు. ఈ ప్రక్రియ వల్ల దానిలోని నాణ్యత పెరిగి, మనుష్యులకు గ్రుచ్చుకోకుండా మెత్తబడేలా ఆ పడగును తయారౌతుంది. ఇదంతా ఒకరు లేదా ఇద్దరు వ్యక్తుల ఒక రోజు శ్రమ. ఆ తర్వాత దాన్ని బాగా ఆరబెట్టి మరునాడు మగ్గంపైకి చేర్చుతారు. దాన్ని రోజుకు ఒక వ్యక్తి ఒకటి లేదా రెండు జాడీలను (ఆ వ్యక్తి శారీరక శక్తిని బట్టి) నేస్తాడు. ఆ తర్వాత ఈ జాడీపై వేడినీటిని పోస్తూ ఒక బ్రష్షుతో దాదాపు 5-6 మంది వ్యక్తులు రుద్దుతూ జాడీని నునుపుగా తయారు చేస్తారు. ఈ జాడీల తయారీలో దీన్ని నునుపుగా తయారు చెయ్యటానికి ఎక్కువ కూలీల ఖర్చు అవుతుంది. ఈ నునుపు చేసే ప్రక్రియకు ఏదైనా చిన్నపాటి యంత్రం తయారైతే బావుంటుందని కోరుకుంటున్నారు ఈ చేనేత కార్మికులు.

**వృత్తి అంతరించి పోతున్న వైనం :**

పూర్వం గ్రామాల్లోని ప్రతి ఇంట్లో జాడీ, కంబళిలు తప్పకుండా వుండేవి. ఆ తర్వాత 'సిరి చాప'లు వచ్చి వీటిపై మొదట దెబ్బతీశాయి. అందుకు కారణం రెండు మూడు వందల రూపాయలకు పైగా విలువగల జాడీలకు బదులు కేవలం 50 రూపాయల లోపు ఖర్చు చేస్తే వచ్చే చాపలే మేలని అనుకున్నారు, ఆ తర్వాత ఈ సిరి చాపలు కూడా ప్లాస్టిక్ మయమయ్యాయి. ఆ తర్వాత రకరకాల బెడ్‌షీట్లు, బొంతలు, జంఖానాలు రావటం వల్ల మరికొంత దెబ్బతింది. ఇంతటి పోటీలో కూడా జాడీలు, కంబళ్ళు వాటి ప్రత్యేకతను చాటుకుంటునే వున్నాయి.

ఒకప్పుడు 'పర్ల' గ్రామంలో 300కు పైగా కుటుంబాలు కేవలం ఈ జాడీ/ కంబళి తయారీతోనే జీవించే వారు. ఆ ఇళ్ళల్లోని గృహిణులు, తమతో పాటు ఇతరులు కూడా జాడీలకు దారం ఏకుతూ తమ సమయాన్ని గడపటంతో పాటు, కాస్త ఆదాయాన్ని కూడా చవిచూసే వారు. అలాంటిది ఇప్పుడు ఆ గ్రామంలో కేవలం "జబ్బార్ మరియు సుంకన్న"ల రెండు కుటుంబాలు మాత్రమే జాడీలు నేస్తున్నారు.

జబ్బార్ కుటుంబంలో అతని కొడుకు సుభాన్ భాషా (9885866070), అతని కోడలు అబిదాబిలు కలిసి చేసుకుంటూ వుంటారు. పడుగు పోసే పని లేకుంటే కోడలు కూడా వ్యవసాయ కూలీకి వెళుతుంటుంది. తమ గ్రామంలో ఈ వృత్తిని మానుకున్న కుటుంబాలు ప్రస్తుతం చేస్తున్న కూలి పనిపట్ల ఏమాత్రం ఇష్టం లేకున్నా, తప్పనిసరి పరిస్థితుల్లోనే వ్యవసాయ కూలీలుగా మారుతున్నారని అంటాడు జబ్బార్. వీరి కుటుంబాలను తిరిగి ఈ వృత్తివైపు మళ్ళించాలంటే కేవలం తమ గ్రామంలో "ఉన్ని బ్యాంకు" ఏర్పాటు చేసినట్లయితే మళ్ళీ పర్ల గ్రామంలో ఈ వృత్తిని పునరుజ్జీవింప చేయటం ఖాయం అంటాడీయన. చేనేత


మగ్గానికి సిద్ధం చేస్తున్న పడుగు

**నీవు నీ భవిష్యత్తుని మార్చుకోలేవు. కానీ నీ అలవాట్లను మార్చుకోగలవు. మారిన నీ అలవాట్లే నీ భవిష్యత్తుని మారుస్తాయి.**



అమ్మకానికి సిద్ధమైన 'జాడి'

కుటుంబాలకు కల్పించే సౌకర్యాలు మాకు ప్రభుత్వాలు అందించటం లేదని వాపోయాడు. ఆఖరుకు ఒకేసారి పెద్ద మొత్తంలో ఉన్ని కొనుగోలు చేసుకుని ఉంచుకోవటానికి బ్యాంకులకు రుణాల కొరకు వెళ్తే వాళ్ళు కూడా చేనేత వృత్తిదారుల ఖాతాలో కాకుండా 'వ్యాపారాత్మక' రుణాలు మంజూరు చేస్తామంటారు. వాటికి వడ్డీ ఎక్కువ కావటంలో బ్యాంకులకు వెళ్ళటం కూడా మానుకుని తమ శక్తికొద్దీ వృత్తిని కొనసాగిస్తున్నామని వాపోయాడు జబ్బార్.

ఇక సుంకన్న కుటుంబంలో అతను తన భార్యతో కలిసి ఈ చేనేత వృత్తి చేస్తూ వుంటాడు. ఈయన వృత్తి కోసం చేసిన ఒక పని ఆశ్చర్యానికి గురి చేస్తుంది. అదేమిటంటే.....

ఈ జాడీలు నేసే ప్రక్రియలో పడుగును శుద్ధి చేయటానికి, జాడీ తయారైన తర్వాత వాటిని కూడా వేడి నీటితో శుద్ధి చేసి నునుపుగా చెయ్యటానికి ఎక్కువ నీరు అవసరం. ఇతని ఇల్లు ఊరి బయట వుండటంతో అక్కడికి గ్రామ పంచాయితీ ఇంకా మంచినీటి సరఫరా ఏర్పాటు చెయ్యలేదు. తనకు కావలసిన నీటిని సేకరించటానికి తన ఇంటివద్దనే ఒక పెద్ద గొయ్యి త్రవ్వి (ఫాం పాండ్ లాగా వుంటుంది), దానిలో ప్లాస్టిక్ సంచులను వేసి ఆ గుంటలోకి దాదాపు 3 ఫర్లాంగుల దూరం నుండి బిందెలతో నీటిని తెచ్చుకుని ఈ గోతిలో నిల్వ చేసుకుని వాటిని జాడీ తయారీ పరిశ్రమలో వినియోగిస్తున్నాడు. సుంకన్న పడుతున్న ఈ కష్టం వింటేనే అందరి మనసులు కలచివేస్తాయి.

ఇంత కష్టంలో కూడా తన వృత్తిని ఎంతో గొప్పగా వర్ణిస్తాడు సుంకన్న. 60 సంవత్సరాల వయసుగల సుంకన్న ఈవృత్తి మాతోనే అంతరించి పోకుండా, తమ గ్రామంలోని ఈ చేనేతవృత్తిదారుల చిన్నారులకు ఒక శిక్షణా పాఠశాల ఏర్పాటు చేస్తే, భవిష్యత్ తరాలకు కూడా ఈ వృత్తి అందుబాటులో వుంటుంది అంటాడు. చిన్నారులు పెద్ద చదువులు చదువుకుని, ఉద్యోగాలు లభించనప్పుడు ఈ వృత్తే వారికి జీవనోపాధి కల్పిస్తుంది అంటాడు సుంకన్న. ఎక్కడికో దూర ప్రాంతాలకు వెళ్ళి ఉద్యోగాలు చేసుకునేకంటే ఇక్కడే ఇంటివద్దనే వుండి అంతకు మించి సంపాదించుకోవచ్చు అంటాడీయన.

**అమ్మకాలు (మార్కెటింగ్) :**

ప్రతి రోజూ ఈ కుటుంబాల వద్దకు జాడీల కొరకు వచ్చి వెళుతునే వున్నారు. ఇప్పటికీ గ్రామాల్లోని చాలా మంది జాడీలు అమ్మేవారే కరువయ్యారని వాపోతున్నారు. కాబట్టి వీరికి గొర్రెల ఉన్నిని అందుబాటులోకి తీసుకు వచ్చినట్లయితే ఈ గ్రామ చేనేత కార్మికులు మళ్ళీ తమ పాత వృత్తిలోనే ఆనందంగా కొనసాగటానికి సిద్ధంగా వున్నారు. ఇందుకు కారణం జాడీలు, కంబళ్ళకు గ్రామాల్లో ఇంకా గిరాకీ



సుభాన్



కంబళి నేత కార్మికులు

జబ్బార్





సుంకన్న నీరునిల్వ చేసేందుకు స్వయంగా త్రవ్వుకున్న 'పాండ్'

**నేర్చుకోవటం వల్ల సృజనాత్మకత వస్తుంది, సృజనాత్మకత ఆలోచనలకి దారి తీస్తుంది, ఆలోచనలు జ్ఞానాన్నిస్తాయి, జ్ఞానం మిమ్ములను గొప్పవాళ్ళను చేస్తుంది.**



పడుగును శుద్ధి చేసేందుకు తయారు చేస్తున్న చింత పిక్కల పేస్టు

ఉండటమే.

మాకు ప్రోత్సాహకాలు ఇచ్చినా, ఇవ్వక పోయినా ముందుగా తమ గ్రామంలో 'ఉన్ని బ్యాంకు' ఏర్పాటు చేసినట్లయితే మేము ఇక్కడే మాకు కావలసినంత ఉన్నిని కొనుగోలు చేసుకుని జాడీలు, కంబళ్ళు తయారు చెయ్యటానికి సిద్ధంగా ఉన్నామంటున్నారు పర్ల గ్రామ చేనేత కార్మికులు. అంతే కాదు, మారుతున్న కాలానికి అనుగుణంగా ఈ వృత్తిని కొత్త పుంతలు తొక్కించేందుకు కూడా మా సృజనాత్మకతను జోడిస్తామంటున్నారు.

సమీప భవిష్యత్తులో కర్నూలు జిల్లాలోని పర్ల గ్రామంలో 'ఉన్ని బ్యాంకు' (వారి గ్రామంలో చేనేత కాఅర్మికులకు అవసరమైనంత ఉన్నిని గొనుగోలు చేసుకునే వీలును కల్పిస్తూ) ఏర్పాటై, ఈ గ్రామం మళ్ళీ కంబళ్ళు, జాడీల తయారీతో కళకళలాడాలని ఆశిద్దాం. తద్వారా అనేక మందికి ఉపాధి కల్పించి, అంతరించి పోతున్న ఈ సాంప్రదాయాన్ని పునరుజ్జీవింప బడుతుందని ఆశిద్దాం. ●


# పల్లెసృజన కార్యాలయంలో ఇన్నోవేషన్ల విస్తృత కేంద్రం

దేశవ్యాప్తంగా పునాదిస్థాయి ఇన్నోవేటర్లు (గ్రామీణ శాస్త్రవేత్తలు) తయారు చేసిన ఇన్నోవేషన్ల ప్రదర్శన 'పల్లెసృజన' కార్యాలయంలో ఏర్పాటు చేయడమైనది. ఈ ప్రదర్శనను పాఠశాల, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, రైతులు సందర్శిస్తున్నారు. రైతులు ఈప్రదర్శనను చూస్తే వారికి అవసరమైన పనిముట్లను గుర్తించి వాటిని లాభకరంగా వినియోగించుకునే అవకాశం లభించటంతో పాటు, దేశీయ జ్ఞానానికి చేయూతను అందించిన వారవుతారు. మీ సమస్యలను పల్లెసృజనతో చర్చించవచ్చు.



విక్రం రాథోడ్ సైకిల్ పంపు




రోషన్‌లాల్ విశ్వకర్మ చెరుకు కణుపులను కత్తిరించే సాధనం





గోపాల్ భీసే సైకిల్ నాగలి





మల్లేష్‌సోలార్ స్ప్రేయర్, లైటు ఫ్యాన్ల రిమోట్

హైదరాబాద్ వచ్చినపుడు 'పల్లెసృజన' కార్యాలయాన్ని తప్పక దర్శించండి. ముందుగా మా కార్యాలయానికి సందేశాన్నిస్తే మీ సందర్శనను అర్థవంతంగా చేస్తాం.

'పల్లెసృజన' కార్యాలయం చిరునామా :

67, రోడ్ నెం. 2, వాయుపురి,
సైనిక్‌పురి పోస్టు, సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-27111959,
సెల్ : 96528 01700.


మీ కలలను సాకారం చేసుకోవాలంటే మీరు ముందు కలలు కనాలి.

# 'ఇగ్నైట్-2016' లో బహుమతి పొందిన చిన్నారుల ఆలోచనలు



**సుమిత్ బిశ్వాస్,** 11వ తరగతి,
డిగ్లిపూర్, అండమాన్ నికోబార్



**తాబేలు గుడ్లను పరిరక్షించే పద్ధతి**

తీర ప్రాంతాలలో తాబేలు పెట్టిన గుడ్లకు మనుషుల నుండి, పాములు, ఇతర జంతువుల వల్ల నష్టం జరగకుండా అవి గుడ్లు పెట్టిన ప్రాంతంలో ఒక సెన్సార్ ఏర్పాటు చేసి దాని బజర్‌ను అటవీ శాఖ వారివద్ద ఉంచితే గుడ్లను తాకగానే అక్కడ బజర్ మోగుతుంది.



**సయాన్ షైన్,** 9వ తరగతి
కలకత్తా,
పశ్చిమ బెంగాల్



**మూసిన తలుపు వెనక వున్న వ్యక్తి వున్నాడని తెలిజేసే సెన్సార్**

తలుపు వెనక వ్యక్తి వున్నాడని తెలియకుండా తలుపు తీస్తే అవతలి వ్యక్తికి దెబ్బతాకే ప్రమాదం నుండి నివారణకు సెన్సార్.



**మున్ని కుమారి,**
7వ తరగతి, పాట్నా, బీహార్





**దేవ్ ఉమాంగ్ దేశాయ్,**
9వ తరగతి, నాసిక్, మహారాష్ట్ర

**వాహనాల తలుపుల్లో వేళ్ళు పడి నలగకుండా సెన్సార్**

ఎక్కువ మంది చిన్నారులు, ఒక్కోసారి పెద్దవాళ్ళ చేతివేళ్ళు వాహనాల తలుపుల్లో పడి నలిగిపోకుండా ఒక సెన్సార్ ఏర్పాటు చేస్తే బావుంటుంది.



**మనోజ్ఞ యస్. వైద్య,**
10వ తరగతి
నాగపూర్, మహారాష్ట్ర



**గాలి పటాల సహాయంతో విత్తనాలు వెదజల్లడం**

ఒక ప్లాస్టిక్ కవర్‌లో విత్తనాలు నింపి గాలిపటం వదిలితే కొంత ఎత్తుకు వెళ్ళాక గాలి వత్తిడికి కవర్‌కు వేసిన ముడి ఊడిపోయి విత్తనాలు వెదజల్లటం చేసి చూపించింది వైద్య.



**పార్థ్ బన్సాల్,** 9వ తరగతి
నోయిడా, ఉత్తరప్రదేశ్



**నరాల బలహీనత జబ్బు (పార్కిన్‌సన్) గల వారికి సహకరించే చేతికర్ర**

ఈ వ్యాధి గలవారు నేరుగా నడవలేరు. వారికి సహకరించేలా చేతి కర్రలో ఒక లైటు ఏర్పాటు చేస్తే నేరుగా నడవటం సులువవుతుంది.



**జాహ్నవి రూపరేలియా,**
9వ తరగతి
రాజ్‌కోట్, గుజరాత్



**బొద్దింకల నివారణకు సులభమైన చిట్కా**

ఇంట్లో బొద్దింకలు నివారించేందుకు జాహ్నవి తక్కువ ఖర్చులో సులభమైన పేస్టును తయారు చేసింది. దానితో బొద్దింకలను సమూలంగా నివారించవచ్చు.



**అద్యాషా దాష్,**
11వ తరగతి
భువనేశ్వర్, ఒడిస్సా



**సాగర్ కుమార్,** 7వ
పాట్నా, బీహార్



**పైపులలో నీరు కారిపోతుంటే తెలియజేసే సైరన్**

ఇళ్లల్లో కాని, కార్యాలయాల్లో కాని ఎక్కడైనా పైపుల్లో నీరు కారుతూ వుంటే వెంటనే తెలియజేయటానికి ఒక పద్ధతిని కనుగొన్నారు.



**హిమాంశు రాతేరియా,**
11వ తరగతి
భువనేశ్వర్, ఒరిస్సా



**మందులు వేసుకోవాలని టీవీలో గుర్తు చేసే ప్రోగ్రాం**

మాత్రలు వేసుకోవటం మర్చిపోయి టీవీ చూస్తున్న వారికి మీరు మాత్రలు వేసుకునే సమయమైంది అని టీవీలో కనిపించేలా తెలిపే ప్రోగ్రాం.

**ప్రియాంక పాండా,** 11వ తరగతి
భువనేశ్వర్, ఒడిసా





**వాసనాల్లో ఇంధనం వృధా అవుతోందని తెలియజేసే పరికరం**

సిగ్నల్ల వద్ద వాహనం ఆగినపుడు ఇంధనం వృధా కావటమే కాక పర్యావరణానికి కలిగే నష్టాన్ని తెలియజేసే పరికరం



**సుబ్ర సుచిస్మితా పటేల్,**
11వ తరగతి
కెఐఐటి ఇంటర్నేషనల్ స్కూల్



**విత్తనాలు నాటేందుకు రంధ్రాలు చేసే పరికరం గల బూట్లు**

రైతు పొలంలో నడుచుకుంటూ వెళ్తే చాలు విత్తనాలు నాటేందుకు రంధ్రాలు చేసి, విత్తనం వేసి, మళ్ళీ కప్పి పెట్టేలా బూట్లు తయారు చేస్తే బావుంటుంది.



**జోషఫ్ జాన్,**
11వ తరగతి
కొట్టాయం, కేరళ



**మడవటానికి వీలుగా వుండే వీల్‌ఛైర్ & వాకర్**

నడవలేని వికలాంగులు కార్లలో సులువుగా ఎక్కటానికి వీలుగా వుండేలా వీల్ ఛైర్ & వాకర్.



**జుఫా ఇక్బాల్,**
12వ తరగతి
శ్రీనగర్ జమ్ము& కాశ్మీర్



**సులువుగా ఉన్ని తివాచీలను తయారు చేసే యంత్రం**

ఒకప్పుడు తివాచీలను చేతితో తయారు చేసే వారు. ఇప్పుడు యంత్రాలు వచ్చాయి. కానీ, కేవలం 15–20 నిమిషాల్లో డిజైన్లతో సహా తివాచీ తయారు చేసే యంత్రాన్ని తయారు చేసింది.




**గుంటూరు జిల్లాలో 9 డిశంబర్, 2016న 'రేపల్లె'లో ప్రారంభమై, 11 డిశంబర్, 2016న 'పల్లెకూన' గ్రామం నుండి 'రేపల్లె'లో ముగిసిన 21వ చిన్న శోధయాత్ర ఉత్సాహం, ఉత్సుకత, జ్ఞాన సముపార్జనే ధ్యేయంగా సాగింది. 34 మంది యాత్రీకులు పాల్గొన్న ఈ యాత్రలో కొందరి మనో భావాలను మీముందుంచుతున్నాం. – ఎడిటర్**

అఖిల మనోభావాలు :

ఇది నేను పాల్గొన్న 8వ శోధయాత్ర అయినా, మొదటిసారి ఉండే కుతూహలము, ఉత్సాహమూ అలాగే ఉన్నాయి. మొత్తం యాత్రలో గ్రామస్తుల ఆదరణ కానీ, బడి పిల్లల ఉత్సాహం కాని, గ్రామాలలో ఆతిథ్యం కాని..... ఏవీ కొత్తగా అనిపించలేదు. వీటిల్లో మొదటి యాత్రలో ఎలా వుందో ఈ యాత్రలోనూ అలాగే వుంది.

ఈ శోధయాత్రలలో ప్రకృతిని చూసి అవాక్కయి పోవాల్సిందే. నిశ్శబ్దంగా, అంతరాత్మతో మాట్లాడుకుంటూ నడవటం, కీచురాళ్ళ రొదల మధ్య, మిణుగురు పురుగులను చూస్తూ ఆనందంగా....... ఇవన్నీ శోధయాత్రలోనే సాధ్యం. అనుభవాలు చెప్పమంటే ఒక్కొక్కరిదీ ఒక అనుభవం. నాకయితే నా అంతరాత్మతో నేను చేసిన సంభాషణ. ఇంకొకరికి, ప్రకృతి పలకరింపులు, మరొకరికి లయబద్ధ మైన అడుగుల శబ్దం.....

ఈ శోధయాత్రలో నాకేం గుర్తున్నాయి అంటే... యాత్ర మొదలైన కొద్ది నిమిషాలలోనే 'షబ్బీర్' అనే ఇన్నోవేటర్‌ని కలిశాం. బహుశా ఇతని కథని తదుపరి శోధయాత్రలలో బ్రిగేడియర్ గారు చెప్పే రోజు వస్తుందని నేను ఆశిస్తున్నాను. 'పెసర్లంక'లో చదువు చెప్పే ఒక టీచర్ 'మీరు చదివే ప్రతి విషయంలో శాస్త్రం ఉంది' అని చెప్పటం.. ఎంతో క్లిష్టతరమైన శాస్త్ర విషయాలను కూడా సరళంగా పిల్లలకు అర్థమయ్యేలా చెప్పటం..... ఔరా ప్రభుత్వ పాఠశాలలు కూడా ఎంత చక్కగా పని చేస్తున్నాయి అనిపించింది...... మనకు తెలిసిన స్నేహితులంతా ఒకప్పుడు అపరిచితులే కదా! వాళ్ళతో మాట్లాడితేనే కదా

**కలలు అనేవి నిద్రలో వచ్చేవి కాదు. కలలు అనేవి మీకు నిద్ర లేకుండా చేసేవి.**



మిత్రులయ్యేది!!. ఈ యాత్రలలో ఎంతోమంది మిత్రులను సంపాదించుకున్నాం. ప్రతి యాత్రలో బ్రిగేడియర్ గారి నుంచి ఏదో ఒక కొత్తది నేర్చుకుంటూనే వున్నాం. ఏమి నేర్చుకున్నామో లిస్టు రాయాలి అంటే ముందుగా ఆయన ఓపిక, శక్తి!!!

**రామ్మోహన్ గుణపతి :**

నాకిది రెండో శోధయాత్ర. ఈ 21వ చిన్న శోధయాత్ర లెక్క ప్రకారం 9 నాడు 'రేపల్లె' నుంచి ప్రారంభం కావలసివున్నా, నాకుమాత్రం 8వ తేదీనే రైల్లో 'జతిన్, అంకిత'లను కలిసినప్పుడే ప్రారంభమైందని చెప్పాలి. ఎవరెవరు కలుస్తారా? ఏమేమి కొత్త విషయాలు తెలుసుకోవాలా? అని ఆలోచిస్తూ రేపల్లె చేరుకున్నాం. రైల్వే స్టేషన్‌లోనే కొదరు యాత్రీకులు కలిశారు. ఒకరినొకరం పరిచయం చేసుకొని 15 నిమిషాలు నడిచి ఎం.సి.ఎ. హాల్ చేరుకున్నాం. అక్కడికి మాలాగే అందరు యాత్రీకులూ చేరుకున్నారు. పరిచయం వున్న వాళ్ళని పలకరిస్తూ, తెలియని వాళ్ళను పరిచయం చేసుకుంటూ అందరం కలిశాం. బ్రిగేడియర్ గణేశం గారు ప్రతి శోధయాత్రలోనూ చెప్పే నలుగురు గురువుల గురించి తెలుసుకున్నాం. అవి 1. ప్రకృతి, 2. గ్రామస్తులు, 3. తోటి యాత్రీకులు, 4. వ్యక్తిగతం గా నేను.

రేపల్లె ఎం.సి.ఎ. హాల్లో డా. వి. ప్రకాశ రావు గారు ఇచ్చిన ఆతిథ్యం స్వీకరించి, ఆయన చేస్తున్న సాంఘిక సేవా కార్యక్రమాల గురించి విని యాత్ర ప్రారంభించాం. తోవలో అరుణ కుమార్ మరియు సత్యనారాయణ గార్లని కలిశాం. వీరు పాము కరిచిన వారికి మందు ఇస్తారు. 'పాము కరిచిన వ్యక్తి వైద్య సదుపాయం అందే వరకు తలపైన బరువైన రాయి పెట్టుకుని ఉండాలి' అని వారు చెప్పినపుడు ఆశ్చర్యం వేసింది. మేమంతా మొదటిసారి వింటున్నామీ విషయం.

ఆ రోజంతా తోటి యాత్రీకులతో ఉత్సాహంగా మాట్లాడుతూ వుంటే నడక బడలిక తెలియలేదు. ఒక్కొక్కరూ ఓ విషయంలో నిష్ణాతులే అని చెప్పాలి. 'తరుణ్' సృజనాత్మక ప్రపంచంలో బ్రతుకుతాడు. 'అరుణ్' నడుస్తునే జర్మనీకి తీసుకువెళ్ళిపోయాడు మమ్మల్ని. 'సంజన'తో పై చదువుల గురించి మాట్లాడుకున్నాం. 'అనురాగ్' మంచి సృజనాత్మక వున్న డైరెక్టర్. ఇక్కడ నేను నవ్వుతూ 'సగం చొట్టబుగ్గలు' అని పిలుచుకునే హరీష్, 'పూర్తి చొట్టబుగ్గలు' అని పిలుచుకునే 'నవీన్' గురించి చెప్పుకోవాలి. 'ఓంకార్', 'గురు'లు మంచి మిత్రులయ్యారు. యాత్ర తర్వాత కూడా కొనసాగించేంత మంచి మిత్రులయ్యారు. నిశ్శబ్దంగానే వుంటూ జోకులు చెప్పే 'లోకేష్' గురించి తప్పనిసరిగా చెప్పుకోవాలి.

ఆరోజు బడి పిల్లలతో కలిసి మట్లాడినప్పుడు వారి ఉత్సాహము, ఉత్సుకత, తెలుసుకోవాలనే వారి తపన చూసి ఆశ్చర్యపోయాము. మేం కొత్త విషయాలు చెప్తూ వుంటే ఎంతో ఉత్సాహంగా మెరిసే కళ్ళతోనే వినేశారు.

ఈ యాత్రలో ఐఐటి అధ్యాపకులు, విద్యార్థులు కలిసి పాల్గొనడం, అదీ వారి కళాశాల ప్రాంగణంలో కాక, ప్రకృతి ఒడిలో చేరి కలిసి కొత్త విషయాలు తెలుసుకోవడం మంచి ఆలోచన అనిపించింది. వారిరువురి దృక్పథాలతో సమస్యలకి త్వరగా పరిష్కారాలు దొరికే అవకాశం



**జీవితము - కాలము ప్రపంచంలో ఉత్తమమైన గురువులు.**
**జీవితం కాలాన్ని ఎలా సద్వినియోగం చెయ్యాలో చెప్తుంది. కాలం జీవితంలోని విలువలను నేర్పుతుంది.**

ఉండవచ్చు. మొదటి రోజు యాత్ర పూర్తయ్యే సమయానికి నేను తెలుసుకున్న విషయం ఏమిటంటే..... సమస్యని పూర్తిగా అర్థం చేసుకుంటే, సగం సమస్యకి పరిష్కారం దొరికినట్లేనని భావించాలి.

**రెండవ రోజు :** 'పెసర్లంక' రాత్రి అలసి వచ్చి పడుకున్న బడి ప్రాగణాన్ని ఉదయం చూసే అవకాశం లభించింది. మా రెండోరోజు యాత్ర యావత్తూ పచ్చని వరి పొలాల మధ్య, గుబురు చెట్లు, పసుపు, అరటి చెట్ల మధ్యనే సాగింది. మొదటి రోజు కనిపించని పచ్చదనం రెండోరోజు పుష్కలంగా కనిపించిందనే చెప్పాలి. ఈరోజు మధ్యాహ్నం మేము ధర్మారావు గారిని కలిశాం. ఆయనా పాము కాటుకి మందిస్తారు. ఆయన తాను ఆ విద్యను ఎలా నేర్చుకున్నది, నలుగురికీ ఏవిధంగా ప్రయోజనం చేకూర్చినది, తాను ఈ విద్యని ఇంకొకరికి నేర్పించాలి అంటే ఆ వ్యక్తిని ఎంత జాగ్రత్తగా ఎంపిక చేసుకునేది చెప్తూ వుంటే కుతూహలంగా వింటూ వుండిపోయాము.

మార్గమధ్యంలో బ్రిగేడియర్ గారు అనేకమంది పునాది స్థాయి ఇన్నోవేటర్ల సృజనలు, వారి కలలు చెప్తూ వుంటే ఆశ్చర్యం వేసింది. ఏమీ చదువుకోకుండా చిన్న పల్లెటూళ్ళలో వ్యక్తుల దగ్గరకు కూడా ఇంత ప్రతిభ దాగివుందా? అనిపించింది. మన విద్యావిధానంపై అనేక ప్రశ్నలు ఉద్భవించాయి. ఆరోజు సాయంత్రం స్థానిక పాఠశాలలో పిల్లలకి సైన్సు పాఠాలు చెప్పే పోతురాజు గారిని కలిశాం. ఆయన తన పిల్లల గురించి, తాను పిల్లలకి ఏవిధంగా పాఠాలు చెబుతాడో వివరించారు.

**మూడవ రోజు :** రాత్రి వెల్లటూరులో సుఖంగా పడుకుని నిద్ర లేచినా అయ్యో ఇదే చివరి రోజే అనిపించింది. 'మేధ' మేడంతో కలిసి నడుస్తూ వుంటే అనేక విషయాలు



తెలిశాయి. మరి ఇది ఆవిడకి 12వ శోధయాత్ర. క్రిష్ణ, నూరెన్‌లతో మాట్లాడటం ప్రేరణకరంగా వుంటుంది. 'వంశీ', 'ఈశ్వర్'లు స్థూలంగా విషయాలను చక్కగా వివరించ గలరు. రాజు అన్నతో మాట్లాడితే శోధయాత్రీకులకు ఎన్ని ఏర్పాట్లు చేయవలసి వుంటుందో వివరించాడు. మొత్తానికి ఈ శోధయాత్ర మళ్ళీ ఒకసారి రావాలి అనే భావనతో ముగించాం.

**సంజన, చేతన్, వంశీవర్ధన్, ప్రొఫెసర్ సత్యప్రకాష్, గురు మోహన్ రెడ్డి తదితరుల మనోభావాలు :**

❀ తన భార్య పూర్తి ప్రోత్సాహంతో అహర్నిశలు బడి పిల్లలు, వారి చదువు, భవిష్యత్తు గురించి ఆలోచించే 'పోతరాజు' సార్‌ను కలిశాం.

❀ కుటుంబం మొత్తం చనిపోగా, నెలకు వెయ్యి రూపాయల ప్రభుత్వ భృతిపై బ్రతుకుతున్నా, నవ్వుతూ మమ్మల్ని పలకరించిన ఒక ముసలి అవ్వని చూశాం.

❀ తానెక్కడో దూరపు ప్రాంతాల్లో నివసిస్తున్నా, తాను పుట్టిన ఊరి బాగు కోసం శ్రమిస్తున్న వ్యక్తి సురేంద్ర గారి గురించి తెలుసుకున్నాం.

❀ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఒక 5 కి.మీ. వ్యాసంలో వున్న







అపజయం అనే రోగాన్ని చంపే ఉత్తమమైన ఔషధం నమ్మకం మరియు శ్రమించి పని చేయటం.







వస్తువులతోటే స్వయం సమృద్ధి సాధించవచ్చు అన్న ఆలోచన గురించి తెలుసుకున్నాం.

❀ పల్లెటూళ్ళలో వచ్చే రోగాలు, రొష్టులకి 50 శాతం మందులు వారే చేసుకోగలరని తెలిసింది.

❀ మనం పట్టణాల్లో నివసిస్తున్నా, పల్లెటూళ్ళపై ఎంత ఆధారం పడినాడో చెప్పగలం.

❀ తెలిసి కొంత, తెలియక కొంత మనం పర్యావరణానికి ఎంత హాని చేస్తున్నామో తెలుసుకున్నాం.

❀ పల్లెటూళ్ళలో చిన్న పిల్లలు కూడా ఎంత తెలివైన వారో, ఎంత చురుగ్గా ఆలోచించ గలరో తెలుసుకున్నాం.

❀ ప్రతి పల్లెటూర్లోనూ స్థానికులు వారి సమస్యలకి వారే పరిష్కారాలు కనుగొనగలరని తెలిసింది.

❀ మనలో ప్రతి ఒక్కరిలోనూ ఒక ఇన్నోవేటర్ దాగి వున్నాడు అని బ్రిగేడియర్ అన్నపుడు నేను చిన్నప్పుడు మా ఊరికి వెళితే ఒక ఇంట్లో వేడిని తట్టుకోవడానికి ఒక రైతు టేబుల్ ఫ్యాన్ వెనక తడిబట్ట ఆరేసి ఎయిర్ కూలర్ తయారు చేసుకోవడం గుర్తొచ్చింది.

❀యాత్రలో స్నానం చేసిన తర్వాత బట్టలు ఆరేసుకోవటానికి కేవలం 20 నిమిషాల టైముండేది. నా తువ్వాలు దళసరిగా ఉండటం వలన ఆరవేయటానికి ఎండగా వున్నచోట ఓ దండెం తయారు చేసుకుని అందరితో పాటు 20 నిమిషాల్లోనే నా తువ్వాలు ఆరబెట్టుకున్నాను. ఆహా నేనూ ఇన్నోవేటర్‌నే అనుకున్నా.

❀ ఈసారి నేనొక్కన్నే కాదు నా మిత్రులందరినీ తీసుకు వెళ్ళాలని నిర్ణయించుకున్నా.

❀ ఒక రైతు సేంద్రియ వ్యవసాయం గురించి మాట్లాడుతూ మీ పట్టణ వాసులకి తెలీదేమో మీరు ఏడాదికి 2 కిలోల రసాయనాలు తింటున్నారు మీకు తెలుసా? అని అడిగినపుడు వారి గురించి మనకు కాదు, మన గురించి వారికి చాలా తెలుసు అనిపించింది.

ఈ శోధయాత్రలు అనేవి ఒకసారి ఉబుసుపోక ఏదో సరదాకని వెళ్ళేవి కావు. మొదటిసారి అలా అనుకుని వెళ్ళినా, మళ్ళీ మళ్ళీ వెళ్ళాలనిపించి, జీవితంపై మన దృక్పథాన్నే మార్చే ఎన్నో విషయాలు తెలుసుకునే అపురూప అవకాశమని తెలిసి వచ్చింది. ఇటువంటి యాత్రలు ఏర్పాటు చేస్తున్న 'పల్లెసృజన'కి ధన్యవాదాలు చెప్పుకుంటున్నా. ●




## పల్లెసృజన

**చందాదారులకు విజ్ఞప్తి**

మీ చందాను పునరుద్ధరించుకునేవారు మీ చందాను పంపేటప్పుడు సభ్యత్వ సంఖ్యను తెలియజేయ గలరు. మీ సభ్యత్వ సంఖ్య, చందా తిరిగి కట్టవలసిన తేదీలు పల్లెసృజన పత్రిక పంపే గోధుమ రంగు కవరుపై అతికించే మీ చిరునామా లేబుల్‌లో మీ పేరు పైన ముద్రించబడి వుంటుంది.

**వివరాలకు ఫోన్ : 040-2711959**


**నీవు క్రితంసారి చేసిన తప్పే నీకు మంచి పాఠం నేర్పుతుంది.**

# నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) - ఇండియా

**స్వయం ప్రతిపత్తిగల సంస్థ, శాస్త్ర సాంకేతిక శాఖ, భారత ప్రభుత్వము**

## జాతీయ 10వ ద్వైవార్షిక పోటీలు

### పునాది స్థాయిలో సహాయం అందని సాంకేతిక ఆవిష్కరణలు (ఇన్నోవేషన్లు) మరియు సంప్రదాయ జ్ఞానముల గుర్తింపు

**నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్** (ఎన్.ఐ.ఎఫ్.), 10వ ద్వైవార్షిక పోటీలకై మనదేశం నలుమూలల్లో పునాది స్థాయిలో దాగివున్న సహాయం అందని సాంకేతిక ఆవిష్కరణలను మరియు సంప్రదాయ విజ్ఞానాన్ని వెలుగులోకి తెచ్చేందుకు ఎన్.ఐ.ఎఫ్. కృషి చేస్తోంది. కర్షకులు, కార్మికులు, జాలరివారు, వర్క్‌షాప్ మెకానిక్‌లు, మురికి వాడలలో నివసించువారు, మహిళలు, విద్యార్థులు మరియు సమాజంలోని ఎవరైనను ఈ పోటీలో పాల్గొనవచ్చును. మీయొక్క ఆవిష్కరణలు వ్యవసాయము (పనిముట్లు, యంత్రములు, క్రొత్త పద్ధతులు, కొత్త వంగడాలు మొదలగునవి), గృహోపకరణాలు, రవాణా, ఎనర్జి (శక్తి) ఉత్పత్తి/పరిరక్షణ, పనిభారం తగ్గించటం, మూలికా వైద్యము (మానవ మరియు జంతు సంబంధమైన) మొదలగువాటికి సంబంధించినవై మరియు తక్కువ ఖర్చుతో కూడుకుని ఎక్కువ కాలం మనగలిగి పర్యావరణానికి హానికరం కానివై ఉండాలి. ఈ ఆవిష్కరణలు మీ సొంత సృజనతో ఎటువంటి సాంకేతిక మద్దతు, పర్యవేక్షణ లేకుండా సహాయం/గుర్తింపు పొందనివై ఉండాలి. మహిళలు మరియు వికలాంగుల యొక్క ఆవిష్కరణలు/ సంప్రదాయ విజ్ఞానానికి ప్రత్యేక బహుమతులు ఇవ్వబడతాయి. చిన్నపిల్లలను (స్కూల్‌కి వెళ్ళేవారు మరియు వెళ్ళనివారు) వారియొక్క సొంత ఆలోచనలను (Original Ideas) పంపమని ప్రోత్సహిస్తున్నాము. సాంకేతిక ఆవిష్కరణలకు సంబంధించిన నమూనాలు (Prototypes), అభివృద్ధి చేయని సృజనాత్మక ఆలోచనలను (Creative ideas) కూడా ఆహ్వానిస్తున్నాము.

వివిధ కేటగిరీలలో బహుమతి ఒక్కటికి రూ. 10,000 నుండి రూ. 7,50,000 వరకు ఉంటుంది. జీవిత కాలపు, జాతీయ మొదటి, రెండవ, మూడవ పురస్కారాలు పొందిన వారికి బహుమతి మొత్తంలో కొంత భాగాన్ని ఉపకార వేతనము (Fellowship) రూపములో (జీవిత కాలపు పురస్కారం పొందిన వారికి 5 సంవత్సరాలు, జాతీయ మొదటి, రెండవ, మూడవ పురస్కారాలు పొందినవారికి వరుసగా 3 సంవత్సరాలు, 2 సంవత్సరాలు, 1 సంవత్సరము) ఇస్తారు. మొత్తము బహుమతిలో పదిహేను శాతం (15%)ను ఆవిష్కరణకర్త(లు) వారి సమాజ సంక్షేమానికి మరియు ప్రకృతికిసంబంధించిన కార్యక్రమాలలో వినియోగించవలసి ఉంటుంది.

పునాది స్థాయిలో ఆవిష్కరణలను మరియు సంప్రదాయ విజ్ఞానాన్ని ప్రోత్సహిస్తున్న వ్యక్తులకు, సంస్థలకు విలేఖరులకు మరియు ప్రజల యొక్క విజ్ఞానానికి/సృజనాత్మకతకు విలువను జోడించి ప్రభావితం చేస్తున్న నిపుణులకు **ప్రత్యేక గుర్తింపు** ఉంటుంది. వ్యక్తులు లేదా సంస్థలు వారి ఆవిష్కరణలు ఎన్నయినా **31 మార్చి, 2017** లోగా మాకు చేరేలా పంపండి.

**మీ ఆవిష్కరణలను పంపవలసిన చిరునామా :**

**National Innovation Foundation,**
**C/o Gram Bharati, Amrapur,**
**Gandhi Nagar-Mahudi Road, Gandhi Nagar, Gujarat-382 721.**
**Phone: (02764) 261131/32/ 38/ 39, Fax: (079) 26731903,**
**Email: campaign@nifindia.org, Website: www.nif.org.in**

**గమనిక :** వృత్తిపరమైన నేపథ్యం/ అనుభవం ఉన్నవారు మరియు వృత్తివిద్యా కోర్సులలో ఉన్న విద్యార్థులు ఆవిష్కరణలు / ప్రతిపాదనలు పంపుటకు అర్హులు కారు. అయితే పునాది స్థాయిలో ఆవిష్కరణలకు విలువను జోడించుటకు వారి సేవలను ఎన్.ఐ.ఎఫ్. ఆహ్వానిస్తోంది. అర్హతలు మరియు సూచనలకు సంబంధించి మరిన్ని వివరాలకు వెబ్‌సైట్ **http://www.nif.org.in/announcement**.చూడండి.

**మీ సంతకం ఎప్పుడు మీ ఆటోగ్రాఫ్‌గా మారుతుందో, అప్పుడే మీ జీవితం సార్థకమైనట్లు.**

### స్కూటర్ ఇంజన్‌తో అంతర సేద్య పరికరం తయారు చేసుకున్న

# సృజనాత్మక రైతు 'బాలయ్య' స్వయం కృషి



నల్గొండ జిల్లా 'రామన్నపేట' మండల కేంద్రానికి చెందిన 42 సంవత్సరాల రైతు 'బాలయ్య' ప్రధాన వృత్తి వ్యవసాయమే అయినా ప్రవృత్తిగా 'బీరువాలు, వ్యవసాయ పనిముట్లు, ఆటో డెంటింగ్' పనుల చేసేందుకు మండల కేంద్రంలో ఒక వర్క్ షాప్‌ను ఏర్పాటు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నాడు. బాలయ్యకు ఇద్దరు తమ్ముళ్ళు (బాలస్వామి – ట్రాక్టరు డ్రైవరు, బాలరాజు– వెల్డరు వర్క్‌షాప్), ఒక అక్క (భవాని) వివాహమై తను వేరే ఊర్లో భర్తతో స్థిరపడింది. వీరి తండ్రి బిక్షపతి, తల్లి లక్ష్మమ్మ (ఇప్పుడు లేదు). బాలయ్య, అతని భార్య సువర్ణలకు ఇంటర్ చదువుతున్న భార్గవి, 8వ తరగతి చదువుతున్న 'భాను' అనే ఇద్దరు కుమార్తెలు. అందరి పేర్లు 'బి'తోనే మొదలవటం యాదృశ్చికమే!

వీరికి పూర్వీకుల నుండి సంక్రమించిన ఆస్తి 9 ఎకరాలు ఉండగా, ముగ్గురు అన్నదమ్ములు తలా 3 ఎకరాలు తీసుకుని, తమ వ్యాపారాలను మానుకుని పొలం పనులు చేసుకుంటూ వుంటే జీవనం కొనసాగడం కష్టమని విభాగాలలో ఒక కొత్త ఒరవడిని దిద్దాడు బాలయ్య. అదేమిటంటే తలా కొంత పొలం పంచుకుని, అటు పొలం పైన, ఇటు వ్యాపారం పైన శ్రద్ధ చూపటం కష్టమని తన తమ్ముళ్ళను ఒప్పించి ప్రతి సంవత్సరం ఒకరు పొలం మొత్తం వ్యవసాయం చేసుకోవటం, మిగిలిన రెండు సంవత్సరాలు తమ తమ వ్యాపారాలతో జీవనం సాగించటం మంచిదని నచ్చ చెప్పి ఒప్పించాడు. వీరి విభాగాలలో అన్యోన్యత చూస్తే ముచ్చటేస్తుంది. ఎవ్వరూ తమ వ్యాపారాలను దెబ్బ తీసుకోకుండా, పొలం పనులపైన మూడేళ్ళకోసారి శ్రద్ధ పెట్టి మంచి పంటలు పండించుకోవాలన్న వీరి మంచి ఆలోచనకు జోహార్లు అర్పించాలి.

**నేను 'హ్యాండ్‌సమ్'గా వుండే వ్యక్తిని కాదు కానీ, అవసరమున్న 'సమ్' పీపుల్‌కి నా 'హ్యాండ్' ఇవ్వగలను.**



ఇక బాలయ్య విషయానికి వస్తే ఈ సంవత్సరం తన పూర్వీకుల పొలం 9 ఎకరాలకు తోడు 5 ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తూ, తన షాపుకు కూడా కొంత సమయం కేటాయిస్తున్నాడు. అయితే తన పొలంలో ప్రత్తి, మిరప, కంది, వరి పంటలు సాగు చేస్తున్నాడు. ప్రత్తి, మిరప, కంది పంటలలో అంతర సేద్యాలు చెయ్యటానికి తగిన సమయంలో ఎద్దులు కిరాయికి లభించక గడ్డి పెరిగి పోవటం సహించలేక పోయాడు. దీనికి ప్రత్యామ్నాయం ఏదైనా చేస్తే బావుంటుందని తనకున్న వెల్డింగ్ షాప్ పరిజ్ఞానంతో ఒక యంత్రం తయారు చేసుకుని విజయవంతంగా సేద్యం చేసుకుంటున్నాడు.

**యంత్రం తయారీ :**

అంతర సేద్యాలు చెయ్యటానికి తయారు చేయాలి అనుకున్న యంత్రానికి ముందుగా ఒక పాత స్కూటర్‌ను కొనుగోలు చేసి, దాని ఇంజన్‌ను మరమ్మత్తు చేయించి, తానే స్వయంగా ఒక ఫ్రేము తయారు చేసి, ఆ ఫ్రేములో స్కూటర్ ఇంజన్‌ను ఏర్పాటు చేసి, దానికి రెండు ఆటో టైర్లు, ఒక గొర్రు, గుంటక, నాగలి సెట్లను కూడా తయారు చేసుకున్నాడు. వీటితో పాటు, కూరగాయలు నాటాలి అనుకుని వాటిని నాటేందుకు బోదెలు చెయ్యాలి కాబట్టి దానికి అనుగుణంగా బోదెలు చేసే పరికరం కూడా ఈ యంత్రానికే ఏర్పాటు చేసుకున్నాడు.

మొత్తంమీద దాదాపు రెండు సంవత్సరాలు కష్టపడి తాను చేసిన డిజైన్ యంత్రాన్ని ఎన్నో ప్రయోగాలు చేసి, ఆ ప్రయోగాలలోని వైఫల్యాలను గుర్తించి, మొత్తానికి తనకు అవసరమైన, అనుగుణమైన అంతర సేద్యాలు చేసే యంత్రాన్ని తయారు చేసుకున్నాడు.

పాత స్కూటర్‌తో తయారైన ఈ సేద్యపు యంత్రాన్ని చూసిన తోటి రైతులంతా బాలయ్యను అభినందించటంతో పాటు, తమకూ ఇటువంటిది తయారు చేసి ఇవ్వమని కొందరు, మరి కొందరు ఇతను తయారు చేసుకున్న దాన్నే బేరమాడి కొనటం జరిగింది. ఇలా బాలయ్య ఇప్పటికే ఉభయ తెలుగు రాష్ట్రాలలోని ఎంతో మంది రైతులకు ఇప్పటికి 50కి పైగా యంత్రాలను తయారు చేసి ఇవ్వటం జరిగింది. ఇతని యంత్రాలు ఆంధ్రప్రదేశ్ లోని తిరుపతి, చిత్తూరు, కడప, కర్నూలు, గుంటూరు జిల్లాలతో పాటు తెలంగాణ లోని దాదాపు అన్ని జిల్లాలకు ఇతని యంత్రం సరఫరా చేయబడి విజయవంతంగా పని చేస్తున్నాయి.





ఒకరిని ఓడించడం చాలా సులువు, మరొకర్ని గెలుచుకోవటమే చాలా కష్టం.

బాలయ్య తయారు చేసిన యంత్రంలో ప్రత్యేక మెకానిజం ఏమీ లేదు. దీనికి రిపేర్లు అంటూ రావు, ఒకవేళ ఏదైనా పరికరం చెడిపోయినా దాన్ని కొనుగోలు చేసుకున్న రైతే స్వయంగా తయారు చేసుకోగలగటం దీని గొప్పతనం.

ఈ యంత్రాన్ని స్కూటర్ నడిపినట్లే కేవలం ఒకటో గేర్లోనే నడిపిస్తూ రైతు తన పొలంలో అంతర సేద్యాలను సునాయాసంగా చేసుకోగలడు. ఎకరాకు కేవలం ఒక లీటరు పెట్రోలుతో అలుపు లేకుండా రోజుకు మూడు నుంచి 4 ఎకరాల వరకు అంతర సేద్యాలను చేసుకోవటం జరుగుతోంది.

బాలయ్య ఈ యంత్రాన్ని తయారు చేయాలి అనుకున్నపుడు వ్యాపార దృష్టితో తయారు చెయ్యలేదు కాబట్టి ఇందులో ఎటువంటి ఇబ్బందులు రాకుండా తయారు చేసుకోవటం వల్ల ఇది రైతుకు నిజమైన నేస్తంగా తయారైంది. ఎంతో విజయవంతంగా సేద్యం చేస్తున్న ఈ యంత్రం తయారీని తెలుసుకున్న 'పల్లెసృజన' ఇటీవల రామన్నపేటకు వెళ్ళి, యంత్రం పని తీరును పరిశీలించింది.

స్కూటర్‌ను స్టార్ట్ చేసినట్లే కిక్ కొట్టి స్టార్ట్ చేసి, స్కూటర్ గేర్లు మార్చినట్లుగానే ఇతను ఏర్పాటు చేసిన హ్యాండిల్‌లో గేరు మారిస్తే యంత్రం పని చేస్తుంది. దాన్ని ఆపాలనుకుంటే క్లచ్ పట్టుకుంటే చాలు ఆగిపోతుంది. ఇంజన్ పూర్తిగా ఆపెయ్యాలంటే, హ్యాండిల్‌కు అతి దగ్గరలోనే ఇంజన్ ఆపు చేసే స్విచ్‌ను ఏర్పాటు చేశాడు. ఈ యంత్రం 5 అడుగుల పొడవు, వెడల్పు 20 అంగుళాలు





(అవసరమనుకుంటే పెంచుకోవచ్చు) వుంటుంది. వీటి టైర్లలో గాలి స్థానంలో నీటిని నింపటం వల్ల పొలంలో యంత్రం కుదుపులు లేకుండా స్థిరంగా నడుస్తుంది. అతి తక్కువ మెకానిజంతో, రైతు తనంతట తానే అవసరమైన మరమ్మత్తులు చేసుకునే విధంగా ఈ యంత్రం తయారు చేసిన బాలయ్యను అభినందించి, అతను రైతాంగానికి ఎంతో మేలు చేసి, ఖర్చులను తగ్గించే ప్రయత్నం చేసిన బాలయ్య ప్రయత్నానికి విస్తృత ప్రచారం కల్పిస్తామని, తగురీతిన సహాయం చేయాలని నిర్ణయించుకుంది 'పల్లెసృజన'.

భవిష్యత్తులో ఏం చేయదలుచుకున్నావు అన్నపుడు బాలయ్య "ఇపుడున్న పరికరానికి ఇంకొక మోటరు ఏర్పాటు చేసి, దానికి రొటోవేటర్‌ను అమర్చే ఆలోచన వుంది" అన్నాడు. ఇతను తయారు చేసిన యంత్రాన్ని వాడుతున్న 'వెంకటేష్' అనే స్థానిక రైతు మాట్లాడుతూ "ఈ యంత్రం తాను చాలా కాలంగా వాడుతున్నానని, నడిపేటపుడు ఎటువంటి కుదుపులు లేవని అన్నాడు. ఏమీ ఇబ్బందులు లేకుండా, రిపేర్లు లేకుండా దీన్ని వాడుతున్నానని అన్నాడు. తనకు ఇంతకు ముందు రెండు ఎడ్లు ఉండేవని, వాటి పోషణ చాలా భారంగా ఉండేదని, ఈ యంత్రం తీసుకున్నాక అవి లేకుండానే తన పొలం పనులు జరిగిపోతున్నాయని" అన్నాడు. వ్యవసాయానికి పశువులు కూడా అవసరమే కదా, మరి అవి లేకుండా వ్యవసాయం ఎన్నిరోజులు మనుతుంది అని ప్రశ్నించగా.... "ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయం చెయ్యటానికి యంత్రాలు ఉపయోగించటం వల్ల తక్కువ

అందరికీ సమానమైన ప్రతిభ ఉండకపోవచ్చు కానీ ప్రతిభను పెంచుకునే అవకాశాలు అందరికీ సమానమే.



పెట్టుబడి అవుతుంది. కానీ, ప్రతి రైతు గేదెలను పెంచుకుని, వాటి పాలను కుటుంబానికి వాడుకుంటూ, వాటి పేడను పొలాలకు ఉపయోగించటం వల్ల ఇంకా ఎక్కువ ప్రయోజనం పొందగలడు" అన్నాడు.

ప్రస్తుతం 25,000 రూపాయలకు ఒక యంత్రాన్ని తయారు చేసి అమ్ముకుంటున్న బాలయ్యకు తగిన ఆర్థిక స్థోమత అందితే రైతుకు ఇంకా తక్కువలోనే ఈ యంత్రం లభించే అవకాశముంది. ఈ యంత్రం అవసరమైన రైతులు ఒక పాత స్కూటర్‌ను కొనుగోలు చేసి, దాని ఇంజన్ రిపేరు చేయించుకుని, ఇంజన్‌ను, హ్యాండిల్‌ను తీసుకు వచ్చి 'పల్లెసృజన'ను కానీ, నేరుగా ఇన్నోవేటర్ బాలయ్యను కానీ సంప్రదిస్తే ఒక వారం రోజుల్లో యంత్రాన్ని తయారు చేసి 20 వేల రూపాయలకే ఇవ్వగలడు.

బాలయ్య ఫోన్ నెం. **99850 54646** ●

### పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి - 'పల్లెసృజన'ను బహూకరిచండి!

## మీవాళ్ళకు మీరిచ్చే అత్యుత్తమ బహుమతి 'పల్లెసృజన'

- మీ నాన్నగారి పుట్టినరోజు
- మీ స్నేహితుడి పెళ్ళి
- మీ సహోద్యోగి రిటైర్మెంట్
- మీ పిల్లలు ఫస్ట్ క్లాస్‌లో పాసైతే

పెళ్ళైనా, పండగైనా, స్కూలు,కళాశాలల్లో చేరినా.... సందర్భం ఏదైనా ఆచారం, సాంప్రదాయం ప్రకారం ప్రతి సందర్భంలో ఓ బహుమతి ఇస్తూ వుంటారు. దానికెంత ఖర్చు చేయాలి? అసలు బహుమతి ఏమివ్వాలి? అన్నవి ఎప్పుడూ ఆలోచిస్తూ ఉంటారు.

❀ ఇచ్చిన బహుమతి ఆ సందర్భంలోనే ఆనందాన్ని పంచేదిగా కాకుండా

❀ అందరూ ఇచ్చిన దానికన్నా భిన్నంగా....

❀ జ్ఞానాన్ని, విజ్ఞానాన్ని పంచేది, పెంచేదిగా ఉండాలంటే.....?

ఇచ్చిన వారికే కాక, తీసుకున్న వారితో పాటు, నలుగురికీ పనికి వచ్చే విధంగా ఉండాలి. మీరో పదిమంది మిత్రులకు, శ్రేయోభిలాషులకు 'పల్లెసృజన' పత్రికను 'బహుమతి'గా ఇవ్వాలంటే, వారి, పేరు, చిరునామా వ్రాసి, రూ. **800** పంపితే మీరు పంపిన చిరునామాకు మీ బహుమతిగా, మీ పేరున **5** సంవత్సరాల పాటు 'పల్లెసృజన' పత్రికను పంపినట్లవుతుంది. ప్రతి సంచిక వచ్చినప్పుడల్లా బహుమతి తీసుకున్న వారు మిమ్మల్ని జ్ఞాపకం చేసుకుంటారు.

**అవును....**

'పల్లెసృజన' పత్రిక మన పల్లెల్లో మారుమూల ప్రాంతాల్లో దాగివున్న విజ్ఞాన సంపదను వెలికి తీసి, ప్రస్తుత నవ సమాజానికి ఉపయోగపడే విధంగా చేయటానికి పాటు పడుతుంది.

మీరు బహుమతి ఇవ్వదలచుకున్న ప్రతి సందర్భంలో తడుముకోవలసిన అవసరం లేకుండా, ఇవ్వదలచుకున్న వారి పేరు, పూర్తి చిరునామా, ఎంతమందికి ఇవ్వాలనుకున్నారో వారి పేరున రూ. **200/-** పంపితే మీ తరుపున వారికి ఒక సంవత్సరం పాటు 'పల్లెసృజన' పత్రికను పంపుతాం.

**- ఎడిటర్**

**మీ చందాలు పంపవలసిన చిరునామా, బ్యాంక్ అకౌంటు వివరాలు ఈ పుస్తకం వెనక కవరు పేజిలో ఉన్నాయి.**

**మీ ప్రమేయం లేకుండా మీరు ఏదీ సాధించలేరు. మీ ప్రమేయమే ఉంటే ఎప్పటికీ ఓడిపోలేరు.**


# ఇతర రాష్ట్రాల పల్లెకబుర్లు

**27111**

**పశువులలో వడదెబ్బకి బెల్లంతో వైద్యం :**

ఎండాకాలంలో సూర్య తాపానికి పశువులకు కూడా వడదెబ్బ సోకుతుంది. ప్రత్యేకించి కరువు ప్రాంతాల్లో ఇది ఎక్కువగా జరుగుతూ వుంటుంది. గుజరాత్ రాష్ట్రంలోని బోతడ్ జిల్లా, రాజ్‌కిప్లా తాలూకా, నవా గ్రామానికి చెందిన 'గబా భాయ్ కరణ్ భాయ్ సప్రాఖేర్' అనే రైతు ఒక గృహ వైద్య చిట్కాను వాడి, పశువులలో ఈ సమస్యకి స్వాంతన కలిగిస్తుంటాడు.

ఆయన రెండు కిలోల బెల్లం తీసుకుని, అందులో 3 లీటర్ల నీటిని కలిపి, రాత్రంతా నానబెట్టి, ఉదయం ఆ ద్రావణాన్ని పలుచని బట్టతో పదిసార్లు వడకట్టి, పశువుచేత తాగిస్తాడు. వడ తీవ్రత ఎక్కువగా వుంటే, ఈవిధంగా రోజుకు ఒక్కసారి చొప్పున రెండురోజులు తాపినట్లయితే పశువు వడదెబ్బ నుంచి కోలుకుంటుంది అంటాడు.



**27112**

**పశువులలో కీళ్ళనొప్పులకు వైద్యం :**

పశువులు కీళ్ళ నొప్పులతో బాధపడుతున్నపుడు కీళ్ళలో విపరీతమైన నొప్పి వచ్చి పశువు నిలబడలేక ఎక్కువగా పడుకోవాలని చూస్తుంది. గుజరాత్ రాష్ట్రంలోని బోతడ్ జిల్లా, రాజ్‌కిప్లా తాలూకా, నవా గ్రామానికి చెందిన 'గబా భాయ్ కరణ్ భాయ్ సప్రాఖేర్' అనే రైతు ఒక గృహ వైద్య చిట్కాను వాడి, పశువులలో ఈ సమస్యకి స్వాంతన కలిగిస్తుంటాడు.



ఇతను ఒక కిలో తుమ్మచెట్టు ఆకులను తీసుకుని, వాటిని మెత్తగా నూరి, అందులో చిటికెడు ఉప్పు కలిపి, ఆ మిశ్రమాన్ని నువ్వుల నూనెలో వేసి మరిగిస్తాడు. మిశ్రమ గోరువెచ్చగా వున్నపుడు ఈ నూనెను తీసుకుని వ్యాధిగ్రస్తమైన కీళ్ళపై పూసి, మెత్తటి బట్టతో కట్టు కట్టేస్తాడు. ఇలా ప్రతి రెండు రోజులకి ఒకసారి 3-4 సార్లు చొప్పున చేస్తే పశువుకు కీళ్ళనొప్పి తగ్గి మామూలుగా నడుస్తాయి.

**మీరు మీ కర్తవ్యానికి సెల్యూట్ చేస్తే ఇంకెవరికీ సెల్యూట్ చెయ్యవలసిన అవసరం లేదు.**
**కానీ మీరు మీ కర్తవ్యాన్ని పొల్యూట్ చేస్తే అందరికీ సెల్యూట్ చెయ్యాల్సి వస్తుంది.**

**27113**

**ఎద్దుల మెడపై గాయాల నివారణకు వైద్యం :**

ఎద్దుల మెడపై కాడి పెట్టేటప్పుడు చేసే పొరపాట్ల వల్ల ఎద్దు మెడపై గాయాలు కావటం సహజం. కొందరు రైతులు గాయమైన మెడపై కూడా కాడిని పెట్టి వాటితో సేద్యం చేయిస్తూ వుంటారు. అది పశువుకు ఎంతో బాధతో కూడుకున్నది. ఈ సమస్య నివారణకు మందుగా 'బాచు భాయ్ నాన్‌జీ భాయ్ సోలంకి' అనే గుజరాత్‌కు చెందిన రైతు ఒక చిట్కా వాడి వైద్యం చేస్తూ వుంటాడు. అతను పశువు వేసిన జొల్లును తీసుకుని ఆ గాయంపై పూస్తాడు. లేదా కోకం పండ్లను ఆరింటిని తీసుకుని, మెత్తగా దంచి వాటిని సగం కప్పు నువ్వులనూనెలో వేసి మరిగిస్తాడు. చల్లారిన తర్వాత వడకట్టి ఆ నూనెను పశువు గాయంపై రోజుకు రెండు మూడు సార్లు పట్టిస్తే మంచి గుణం కనిపిస్తుంది అంటాడు.



**26201**

**పొదుగు వాపు వ్యాధికి మందు :**

పాలిచ్చే గేదెలకు, ఆవులకు పొదుగు వాపు వ్యాధి అప్పుడప్పుడూ సంక్రమిస్తుంటుంది. అటువంటి సమయంలో పశువు పాలిండ్లలోంచి ఒక్కోసారి చీము లాంటి ద్రవం కూడా స్రవిస్తూ వుంటుంది. ఆ సమయంలో పశువు చాలా బాధకు

కేవలం విజయగాథలు చదివితే వివరాలు మాత్రమే తెలుస్తాయి. అదే అపజయాల కథలు చదివితే విజయాలకి మార్గం దొరుకుతుంది.

**ఏదైనా సమస్యకు పరిష్కారం చూపి, ఇతరుల జీవితాలను మెరుగు పరిచి,**
**మీకు బహుమానం సంపాదించి పెట్టగల**
**సాంకేతికపరమైన**
**ఆలోచన ఏదైనా మీవద్ద ఉన్నదా?**

## నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) - ఇండియా

అహమ్మదాబాద్ సమర్పించు

# ఇగ్నైట్-2017

**పాఠశాల విద్యార్థులకై స్వంత సాంకేతిక ఆలోచన మరియు ఇన్నోవేషన్ల పోటీ**

దరఖాస్తులు ఆగస్టు **31, 2017** వరకు ఆమోదించబడతాయి.

మీయొక్క లేదా ఇతరుల జీవితాలను లేదా పనిని సులభతరం చేసే కొత్త యంత్రాలు/ పరికరాలు లేదా ఇంతకుముందే వున్న వాటినిసాంకేతికపరంగా అభివృద్ధి చేసే పద్ధతులకై వెతుకుతున్నాం.

**ప్రత్యేకంగా వున్న ఇన్నోవేటివ్ ఆలోచనలకి, ఇన్నోవేషన్లకి వీలైతే పేటెంట్ పొందటానికి మరియు వ్యాపార అభివృద్ధి అవకాశాలకి సహాయం అందించటమే కాక, సాంకేతిక, ఆర్థిక సహాయం కూడా అందిస్తాం.**

మీవద్ద ఏదైనా సృజనాత్మకమైన ఆలోచన ఉన్నట్లయితే వచ్చి పాల్గొనండి.

**దరఖాస్తులు పంపవలసిన / వివరాలకై సంప్రదించ వలసిన చిరనామా :**

**IGNITE - 17**
**National Innovation Foundation**
C/o Gram Bharati, Amrapur,
Gandhi Nagar-Mahudi Road, Gandhi Nagar, Gujarat-382 721.
Phone: (02764) 261131/32/ 38/ 39, Fax: (079) 26731903,
E-mail : ignite14@nifindia.org, http://nif.org.in/submitidea.php

పల్లెసృజన, 67, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-27111959, సెల్ : 9866 00 1678
**E-mail : president@pallesrujana.org, www.pallesrujana.org**

* మీ దరఖాస్తులలో దయచేసి మీ ఆలోచనలు, ఇన్నోవేషన్లు, చిత్రాలు ఉంటే డయాగ్రమ్ (ఉంటే) తో పాటు మీ పూర్తి పేరు, చిరునామా, ఫోన్ నెంబరు, చదువుతున్న తరగతి, పాఠశాల/ కళాశాల పేరుతో పాటు తప్పక వ్రాసి పంపవలెను.

# 'పల్లెసృజన'లో వికసించిన రెండు 'పద్మా'లు



ఉభయ తెలుగు రాష్ట్రాలలోని మారుమూల పల్లెల్లో నివసిస్తున్న, పెద్దగా చదువుకోకపోయినా సామాజిక శ్రేయస్సు కోసం ప్రజా సమస్యలను తమ సృజనాత్మక శక్తితో పరిష్కార మార్గాలు చూపించిన ఎందరో ఇన్నోవేటర్లను 'పల్లెసృజన' ఒక వేదికగా మారి సమాజానికి పరిచయం చేసింది. కేవలం పరిచయం చెయ్యడమే కాకుండా, వారికి స్థానిక, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో కూడా గుర్తింపు కలిగేలా చేసి వారి ఆవిష్కరణల ద్వారా సమాజంలోని వ్యక్తుల జీవన విధానంలో మార్పులు తీసుకు రావటానికి పాటు పడుతునే వుంది. ఇటువంటి వారిని నలుగురికీ పరిచయం చెయ్యటం ఒక యెత్తయితే వారికి వివిధ స్థాయిలలో గుర్తింపు/ పురస్కారాలు రావటం తెలుగు వారికే కాక, పల్లెసృజనకి కూడా ఎంతో ఆనంద దాయకం, గర్వ కారణము అవుతుంది. ఈవిధంగానే 'పల్లెసృజన' ద్వారా గుర్తించబడి, పరిచయం చేసిన ఇద్దరు పునాది స్థాయి ఇన్నోవేటర్లకు భారత ప్రభుత్వం 2017వ సంవత్సరానికి కాను 'పద్మశ్రీ' పురస్కారం ప్రకటించడం మనందరికీ, ప్రత్యేకించి 'పల్లెసృజన'కి ఎంతో ఆనందం, సంతృప్తి కలిగించిన విషయం. ఆ ఇద్దరు 1. చింతకింది మల్లేశం, 2. దరిపల్లి రామయ్య గారలు. వీరిరువురూ ఇంతకు మునుపు 'పల్లెసృజన' ద్వారా మీకు పరిచయం చేయబడిన వారే. వారి గురించి సంక్షిప్తంగా గుర్తు చేస్తున్నాం.

**1. దరిపల్ల రామయ్య :** 'వృక్షమిత్ర' గా ప్రపంచానికి సుపరిచితమైన ఖమ్మం జిల్లాకు చెందిన శ్రీ రామయ్య గారి వయస్సు 77 సంవత్సరాలు. చిన్నతనం నుంచి కూడా తన తల్లి ఇంట్లో మొక్కలు నాటడం, వాటిని పెంచటం, వాటివలన నలుగురికీ జరిగే మేలు గురించి తెలుసుకొని ప్రభావితమైన ఈయన మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఒక ఉద్యమంగా చేపట్టి ఇప్పటికి కోటికి పైగా మొక్కలు (నీడనిచ్చేవి, పళ్ళనిచ్చేవి, పూలనిచ్చేవి, ఔషధ విలువలు కలిగినవి.....) నాటారు. నాటడమే కాదు, వాటిని సంరక్షించడంతో వాటిలో కొన్ని మహా వృక్షాలు కూడా అయ్యాయి. "వృక్షో రక్షతి రక్షితః" అని మనసా, వాచా, కర్మణా నమ్మే ఈయన వృక్షాన్ని మనం రక్షిస్తే అది మనల్ని రక్షిస్తుంది అన్న ధ్యేయంతో వృక్షాలు నాటుతునే వున్నారు. 'ప్రపంచాన్ని పచ్చగా చూడాలి' అన్న ఈయన 'పల్లెసృజన' దృష్టికి



**ప్రేమించటానికి ఈ జీవితకాలం సరిపోదు. మరి ద్వేషించటానికి మనుషులకి సమయం ఎక్కడ్నించి వస్తుందో?**




రావటంతో ఎన్.ఐ.ఎఫ్. సహకారంతో "2015 – సృష్టి సమ్మాన్" పురస్కారంతో సత్కరించింది. ఇప్పుడు సమాజానికి ఈయన చేస్తున్న సేవను, కృషిని గుర్తించి భారత ప్రభుత్వం 'పద్మశ్రీ' పురస్కారం ప్రకటించింది. ఈ సత్కారం పర్యావరణ రక్షణ చేసే అందరినీ సత్కరించినట్లుగా 'పల్లెసృజన' భావిస్తోంది.

**2. చింతకింది మల్లేశం :** నల్గొండ జిల్లా ఆలేరు మండలం శారాజీపేట గ్రామంలో నేత కుటుంబంలో జన్మించిన చింతకింది మల్లేశం చదివింది కేవలం 10వ తరగతే అయినా, తాను జన్మించిన చేనేత సమాజానికి ఎనలేని సేవ చేశాడనే చెప్పాలి. పోచంపల్లి నేత చీరల తయారీలో 'ఆసు పోయటం' అనేది కష్టమైన ప్రక్రియ. తన తల్లి ఆసు పోసి అలసిపోవటం, భుజం నొప్పితో బాధ పడటం చూడలేక ఆ ప్రక్రియం సులభతరం చేయటానికి ఒక 'ఆసు యంత్రం' తయారు చేశాడు. దీంతో ఒక చీరకు ఆసు పోయటానికి ఒకరోజు పట్టే సమయాన్ని కేవలం గంటన్నర సమయంలో వేరువేరు డిజైన్లతో ఆసు పోసే సదుపాయం కల్గింది. దానికి తన తల్లిపేరే "లక్ష్మీ ఆసు యంత్రం" అని ఎన్.ఐ.ఎఫ్. సలహాతో నామకరణం చేశారు. అనేక సంవత్సరాలు కష్టించి ఆ ఆసు యంత్రాన్ని ఇంకా ఆధునీకరించి నేత పనివారినే కాక, కొందరు కేవలం ఆసు పోసుకుని జీవనం కొనసాగించే స్థాయికి తీసుకు వచ్చాడు. మగ్గాలు మూలకు పెట్టిన అనేక మందికి తిరిగి ఉపాధి కల్పించాడు. 'పల్లెసృజన' వెలుగులోకి తీసుకు వచ్చిన చింతకింది మల్లేశంను ఎన్.ఐ.ఎఫ్.కి పరిచయం చేయగా, 2009లో ఈయనకు ఎన్.ఐ.ఎఫ్. వారి 5వ జాతీయ పునాది స్థాయి ఇన్నోవేషన్ల పోటీల్లో ప్రథమ బహుమతిని 'రాష్ట్రపతి' ద్వారా అందుకున్నారు. 2016లో ప్రధాని నరేంద్రమోడీ చేతుల మీదుగా 'అమేజింగ్ ఇండియన్' పురస్కారం అందుకున్నాడు. ఇదే కాక, రాష్ట్రపతి భవన్‌లో 'ఇన్నోవేషన్ స్కాలర్‌గా పదిహేను రోజులు అతిథిగా గడిపారు. పూర్వ రాష్ట్రపతి అబ్దుల్ కలాం గారితో కూర్చుని అల్పాహారం చేస్తూ తన ఇన్నోవేషన్ గురించి వివరించిన వ్యక్తి మన మల్లేశం.

**'నారమ్'లో సన్మానం :** వీరిరువురికీ 'పద్మశ్రీ' పురస్కారం ప్రకటించిన సందర్భంలో 'నారమ్' సంస్థ 'పల్లెసృజన' సౌజన్యంతో జాతీయ స్థాయి కార్యక్రమంలో వీరిరువురినీ అనేకమంది వ్యవసాయ శాస్త్రవేత్తల, పుర ప్రముఖుల, విశ్వ విద్యాలయ వైస్ ఛాన్సలర్ల సమక్షంలో సన్మానించడం జరిగింది. దీనికి చొరవ తీసుకున్న 'నారమ్' అధినేత శ్రీమతి కల్పనా శాస్త్రి గారికి 'పల్లెసృజన' ధన్యవాదాలు తెలియజేసుకుంటుంది.




**చేతకాదని ఎప్పుడూ చేతులెత్తేయకూడదు. సమస్యలు మనల్ని ఓడించనీయకూడదు.**

# స్పందన

గణేశం గారు,

లీలావతి నమస్కరించి వ్రాయునది. మీరిచ్చిన చిన్న స్ఫూర్తి నా మనస్సులో వెలుగులునింపింది. మా అమ్మ పడిపోయినప్పుడు నేను ఎంతో ధైర్యంగా సంతోషంగా ఆమెకి సేవ చేశాను. ఎందుకంటే నాకు ఏదైనా మంచి ఆలోచన రాకపోతుందా, తప్పకుండా పదిమందికి పనికొస్తుంది అని, ప్రతివాళ్ళు అయ్యో ఎలా చేస్తున్నావు అంటే నవ్వుతూ ఉండేదాన్ని. నిజంగా నాకు ఎంతో మంచి ఆలోచన సంవత్సరం తర్వాత వచ్చింది. టాయిలెట్ టబ్బులో సర్ఫ్ నురుగు పోసి పెట్టాలి. అప్పుడు వాసన రాదు, గిల్టీ ఫీలింగ్ పోయింది. నాకు ఇంట్లో వాళ్ళకి ఎంతో ప్రశాంతం, అంటే గండం గట్టెక్కినట్లే ఉంది. ఎక్కడికెళ్ళినా కన్నతల్లి రుణం తీర్చుకుంటున్నావమ్మా, ఎంత గొప్ప పని చేశావు అంటున్నారు. ఇది మీ చలవే!

**– పాటిబండ్ల లీలావతి.**

శ్రీమతి లీలావతి గారు,

మీ భావాలు మా హృదయాన్ని స్పందింపజేశాయి. మీరు మీ తల్లిగారికి పెద్ద మనసుతో చేసిన సేవ అమూల్యం. 'సర్ఫ్' పౌడర్‌తో వాసనలు పోతాయన్న ఇన్నోవేషన్ వినూత్నం. ఈ ఆలోచన అందరికీ అవసరం. అప్పుడే అందరూ వారి తల్లిదండ్రులకు సేవ చేయగలరు. 'పల్లెసృజన' వల్ల మీరు స్ఫూర్తి చెందాననడం మా భాగ్యం. మీ లాంటి పెద్దవారి నిరంతరం నిజ జీవితంలో చేసే ఇన్నోవేషన్లు మా అందరికీ స్ఫూర్తి. మీరంతా ఆరోగ్యంగా ఉండాలని భగవంతుణ్ని కోరుతున్నాం. నమస్సులతో ...

**– బ్రిగేడియర్ గణేశం.**

రాఘవ రెడ్డి గారికి,

పల్లెసృజన సామాన్య రైతుల కొరకు చేస్తున్న సేవలు అనిర్వచనీయం. మీరు చేస్తున్న సేవలకు భారత ప్రభుత్వం 'పల్లెసృజన' ద్వారా పాఠకులకు పరిచయమైన దరిపల్లి రామయ్య, చింతకింది మల్లేశం లకు "పద్మశ్రీ" పురస్కారం ప్రకటించడం ఎంతో శుభశకునం. వారిద్దరి కీర్తిని జాతీయ స్థాయిలో నిలబెట్టడంలో కృషి చేసిన 'పల్లెసృజన' యాజమాన్యానికి నా అభినందనలు.

చిన్న, సన్నకారు రైతులకు వ్యవసాయం లో పెట్టుబడులు తగ్గించేందుకు మన ఇన్నోవేటర్లు చేస్తున్న కృషి అభినందనీయం. కానీ, దాదాపు అందరు ఇన్నోవేటర్లు వ్యవసాయ ఖర్చులను తగ్గించేందుకు యంత్రాలే ప్రత్యామ్నాయం అన్నట్లుగా ఆలోచించడం నా మనసుకు కాస్త బాధగా అనిపిస్తోంది. ఇలా చేసుకుంటూ పోతే 'పశు సంపద' పెంపొందక, భవిష్యత్తులో సేంద్రియ వ్యవసాయం పెరుగుతుందన్న అభిప్రాయం పట్ల కాస్త అనుమానంగా అనిపిస్తోంది. కాబట్టి మన ఇన్నోవేటర్లకు ఎద్దులతో వ్యవసాయం చేయటంలోనే కూలీల ఖర్చు తగ్గే ఆలోచన చేసి పరికరాలు రూపొందిస్తే బావుంటుందని అనుకుంటున్నాను. ఉదా.: ప్రత్తి, మిరప, కంది లాంటి పంటలలో అంతర సేద్యాలకు మీరు చూపిస్తున్న యాంత్రిక పరికరాలు కాకుండా, ఒకే ఎద్దుతో అంతర సేద్యాలు చేసేలా పరికరం రూపొందిస్తే బావుంటుందన్నది నా అభిప్రాయం. ఈ విషయం ఇన్నోవేటర్లతో సంప్రదించి, ఒకే ఎద్దుతో వ్యవసాయం చేయటానికి అనువైన పరికరాలు రూపొందించే ఏర్పాటు చేయిస్తారని ఆశిస్తాను.

ఇప్పుడు ఒకే ఎద్దుతో చేయించే పని కేవలం 'ఒంటెద్దు బండిలో ఇసుక, వ్యవసాయ ఉత్పత్తుల మూటలు మోయించటం' వరకే పరిమితమైంది. వ్యవసాయ పనిముట్లు తయారు చేయిస్తే ఒంటెద్దు వ్యవసాయం కూడా అభివృద్ధి చెందగలదేమో ఆలోచించి పరిష్కార మార్గాలను అన్వేషిస్తారని ఆశిస్తాను.

**– పోచా చిన్న నాగిరెడ్డి,** 'పల్లె ప్రగతి' స్వచ్ఛంద సేవా సంస్థ, వడ్డెమాను గ్రామం, కర్నూలు జిల్లా.

నాగిరెడ్డి గారికి,

మీ అభినందనలకు ధన్యవాదములు. మీలాంటి వారి సహకారమే మమ్ములను మున్ముందుకు నడిపిస్తోంది. మీరు ఎద్దులతో చేసే వ్యవసాయం మరుగున పడిపోకుండా కాపాడాలన్న మీ అభిప్రాయాలను మేమెప్పుడూ సమర్థించటానికి సిద్ధం. మీరు పంపిన ఆలోచనలను మన ఇన్నోవేటర్లతో పంచుకుని, 'ఒంటెద్దు వ్యవసాయం' చేయటానికి అనువైన పరికరాలు చెయ్యటానికి తప్పకుండా సంప్రదిస్తామని మీకు తెలియజేస్తున్నాము. **– వీర రాఘవ రెడ్డి,** సంపాదకవర్గ సభ్యుడు.

**ఒక మంచి పుస్తకం వందమంది స్నేహితులతో సమానం. కానీ ఒక మంచి స్నేహితుడు ఒక గ్రంథాలయంతో సమానం.**



రైతులకోసం రైతులు కనిపెట్టిన సేంద్రియ క్రిమి సంహారక మందులు
తులసి
పంటల ఎదుగుదలకు,
వైరస్ నివారణకు
సేంద్రియ మందు
కావలసిన వారు సంప్రదించవలసిన ఫోన్
9985758013
పర్ఫెక్ట్
వరిలో సుడిదోమ
పత్తి, మిరప, ఇతర కూరగాయ
పంటలను ఆశించే రసం పీల్చే పురుగు,
తెల్లదోమ, పచ్చదోమ, పిండినల్లి
మొదలైన వాటిని
సమర్థవంతంగా నివారిస్తుంది
కావలసిన వారు సంప్రదించవలసిన ఫోన్
9985758013
సృష్టి
కృషక్
పంటల
ఎదుగుదలకు,
ఆకుముడత తెగులు
నివారణకు
సేంద్రియ మందు
సృష్టి
సుదర్శన్
పంటల
ఎదుగుదలకు,
కూరగాయల పంటలలో
పురుగుల నివారణకు
సేంద్రియ మందు
సృష్టి
సర్వత్ర
పంటల ఎదుగుదలకు,
రసం పీల్చే పురుగు
నివారణకు
సేంద్రియ మందు
సృష్టి
ప్రహార్
పంటల ఎదుగుదలకు,
పిండినల్లి
నివారణకు
సేంద్రియ మందు
సృష్టి
ప్రయాస్
పంటల ఎదుగుదలకు,
పూత రాలుట
నివారణకు
సేంద్రియ మందు
సృష్టి
శక్తి
పంటల ఎదుగుదలకు
సేంద్రియ మందు
సృష్టి
శస్త్ర
పంటల ఎదుగుదలకు,
తామర పురుగు, తెల్లదోమ,
శనగపచ్చ పురుగుల
నివారణకు సేంద్రియ మందు
సృష్టి
కె&సి
పంటల ఎదుగుదలకు,
బ్యాక్టీరియా, ఫంగస్
నివారణకు
సేంద్రియ మందు
సృష్టి
సురక్ష
పంటల ఎదుగుదలకు,
చెదల నివారణకు
సేంద్రియ మందు
సృష్టి
రక్షక్
పంటల ఎదుగుదలకు,
పత్తి పంటలో
పురుగుల నివారణకు
ఎంద్రియ మందు
పశువుల ఆరోగ్యం 'బోయ పెద్దరాజన్న' వైద్యం
'పొదుగువాపు' వ్యాధి మందు
ప్యాకెట్‌లోని సగం పొడిని
వేడినీటిలో కలిపి
వాచిన పొదుగుకు పట్టించాలి.
రెండురోజులు వరుసగా
పొదుగుకు పట్టించినచో
పొదుగు మామూలుగా మారి
పాలు పితకడానికి వీలవుతుంది.
మీ అభిప్రాయాలను మాకు తెలపండి
క్రియేటివ్ మైండ్స్
ఫోన్ : 040-ఫోన్ : 040-27111959
ఇ-మెయిల్ : creativemindsap@gmail.com
కావలసిన వారు
సంప్రదించవలసిన చిరునామా :
పల్లెసృజన
ఇంటి నెం. 67,
వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500094.
ఫోన్ : 040-27111959,
సెల్ : 96528 01700
పశువుల ఆరోగ్యం 'బోయ పెద్దరాజన్న' వైద్యం
'కుందా' వ్యాధి మందు
(నరాల బలహీనతతో కాళ్ళు చచ్చుపడిపోవడం)
2 వెల్లిపాయలు, 20 మిరియాలు పొడిలో కలిపి నూరి
వేడినీటిలో కలిపి ఒకరోజు ఉదయం మరియు సాయంత్రం
పశువుకు త్రాగించాలి.
ఈ ప్యాకెట్‌లోని మందు ఒకరోజు
పశువుకు త్రాగించడానికి ఉపయోగ పడుతుంది.
మీ అభిప్రాయాలను మాకు తెలపండి
క్రియేటివ్ మైండ్స్
ఫోన్ : 040-27111959
ఇ-మెయిల్ : creativemindsap@gmail.com

PALLESRUJANA Telugu Bi-monthly 20/-    January-February-2017    RNI No. APTEL 12136/01/01/2011-TC

# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?

ఒక్కో సంచిక రూ. 30 /-లు మాత్రమే





### చందా వివరాలు

| వివరములు | వ్యక్తిగతం | సంస్థ/లైబ్రరీ |
|---|---|---|
| సంవత్సరానికి | 200/- | 800/- |
| రెండు సంవత్సరాలకి (ఒక పాత సంచిక ఉచితం) | 350/- | 1,400/- |
| మూడు సంవత్సరాలకి (రెండు పాత సంచికలు ఉచితం) | 500/- | 2,000/- |
| ఐదు సంవత్సరాలకి (నాలుగు పాత సంచికలు ఉచితం) | 800/- | 3,200/- |

పల్లెసృజన చందాదారులు కండి, పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి. చందాదారులుగా చేరాలనుకున్నవారు ఈ క్రింది చిరునామాకు మీ యం.ఓ.లు పంపండి. మీ చిరునామా స్పష్టంగా వ్రాయటం మరవకండి.

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-27111959, సెల్ : 9866 00 1678
E-mail : president@pallesrujana.org   Visit us : www.pallesrujana.org

లేదా నేరుగా ఈ బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయండి.
మీ చిరునామాను స్పష్టంగా మాకు వ్రాసి పంపండి లేదా యస్.యం.యస్. లేదా ఇ-మెయిల్ చేయండి.

M/s Pallesrujana, Syndicate Bank, Sainikpuri, Secunderabad.
SB A/c No. 30232200019150, IFS Code : SYNB0003023

Narendra Grafix, Hyd. Ph.: 81257 99904